ప్రజాపక్షం
PRAJAPAKSHAM
స్తంభాద్రి భద్రాద్రి
శనివారం | 29 | జూన్ | 2024
పేజీలు 8

## స్వీపర్ల సమస్య ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తా : కూనంనేని




కూనంనేనికి వినతి పత్రం సమర్పించిన స్వీపర్లు

2 లో

# బిజెపి పాలనలో పెరుగుతున్న ఆర్థిక అంతరాలు




**ప్రజాపక్షం/ ఖమ్మం :** బిజెపి పాలనలో దేశంలో ఆర్థిక అంతరాలు పెరిగిపోతున్నాయని అతి కొద్ది మంది చేతుల్లో దేశ సంపద పోగుబడు తుందని సిపిఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ ఆరోపించారు. భవిష్యత్తులో భారత ఆర్థిక వ్యవస్థ కొందరి గుప్పెట్లో చేరడం ద్వారా ఆర్థికంగా దేశం ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. సిపిఐ

మిగతా 2లో..

-మతోన్మాదులను హెచ్చరించిన ఎన్నికల ఫలితాలు
-విస్తృతి, బలోపేతమే లక్ష్యంగా కార్యాచరణ
-సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో జాతీయ కార్యదర్శి నారాయణ

# గోదావరి జలాలు అంకమ్మ చెరువుకు తెస్తాం

- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల



**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** రెండు ఏళ్లలో గోదావరి జలాలు అంకమ్మ చెరువుకు నేరుగా తెస్తామని వ్యవసాశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఆయన ఆయిల్ ఫామ్ ఎండి యాస్మిన్ బాష, శాసనసభ్యులు జారే ఆదినారాయణతో కలిసి ఫ్యాక్టరీ ఆవరణంలో సుమారు రూ.32కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న 25 మెగా వాట్ల విద్యుత్ పవర్ ప్లాంట్‌ను పరిశీలించారు. ఎప్పటిలోగా నిర్మాణం పూర్తవుతుందని అధికారులను అడిగి తెలుసుకున్నారు. వచ్చే నెల చివరి నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఫామాయిల్ సాగును 10లక్షల ఎకరాల్లో విస్తరించేందుకు ప్రభుత్వం రైతులకు ప్రత్యేకమైన ప్రోత్సహాకాలు ఇస్తుందన్నారు. రైతులకు స్థిర ఆదాయాన్ని ఇచ్చే పంట ఆయిల్‌ఫామ్ అని అన్నారు. 10లక్షల మెట్రిక్ టన్నుల ఆయిల్

మిగతా 2లో..

# బడి వైపు.. గిరిజనం చూపు



**ప్రజాపక్షం/ చర్ల :** ఎప్పుడు చూసినా ఏదో ఒక హడావుడి. పోలీసుల బూట్ల చప్పుళ్లు లేదంటే అన్నల రాకపోకలు. ఎప్పుడు ఎవరిపై ఎవరు దాడి చేస్తారో తెలియని ఒక దయనీయ స్థితి. ఎక్కడో ఓ చోట ప్రతి రోజు వినపడే తుపాకి మోతలు.
ఆ అమాయక గిరిజనం ఈ తుపాకి మోతల

మిగతా 2లో..

-మారుతున్న ఛత్తీస్‌గఢ్ ఆదివాసీలు
-తుపాకి చప్పుళ్ల నడుమ అక్షరాభ్యాసాలు

# పట్టా భూముల్లో ప్రభుత్వ బోర్డులు




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** వందల సంవత్సరాలుగా ఆ భూములు మా ఆధీనంలో ఉన్నాయని అక్కడే సుదీర్ఘ కాలం జీవించిన మేము వేరే ప్రాంతంలో ఇండ్లు నిర్మించుకుని జీవిస్తున్నామని కాని ఇప్పుడు ఆ స్థలాలు ప్రభుత్వ భూములని

మిగతా 2లో..

-విచారించి భూములు అప్పగించాలంటున్న రైతులు
-మంత్రులకు వినతి
-భూములను పరిశీలించిన సిపిఐ నేతలు

# బిజెపి పాలనలో పెరుగుతున్న ఆర్థిక అంతరాలు



(మొదటిపేజీ తరువాయి)
రాష్ట్ర కార్యవర్గ సమావేశం శుక్రవారం ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో పోటు ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన నారాయణ మాట్లాడుతూ కార్పొరేట్ శక్తులు, మోడీ అనుకూల సంస్థలు కోట్లాది రూపాయల ప్రజా ధనాన్ని కూలగోడుతుంటే మరో పక్క పేదలు మరింత పేదలు అవుతున్నారని ఆయన ఆరోపించారు. ప్రపంచంలో పేదరికం గణనీయంగా పెరుగుతున్న దేశాల్లో భారతదేశం కూడా ఒకటన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ ఒక కుదుపుకు గురవుతుంటే ప్రధాని మోడీ మాత్రం అబద్దాలు చెబుతూ దేశం ఆర్థికంగా వెలిగిపోతుందని ప్రధాని మోడీ చంకలు గుద్దుకుంటున్నారని కాని వాస్తవ పరిస్థితులు ఇందుకు విరుద్ధంగా ఉన్నాయని నారాయణ తెలిపారు. పార్లమెంటు ఎన్నికల్లో బిజెపి గెలిచినప్పటికీ దాని పరిస్థితి చావు తప్పి కన్ను లొట్టబోయినట్లయిందని ఆయన తెలిపారు. బిజెపి 400 సంఖ్య ఎందుకు రాలేదో అర్థం చేసుకోవాలన్నారు. మతోన్మాద శక్తులకు ఈ ఎన్నికలు ఒక గుణపాఠం లాంటివని ఏ మతాన్ని చూపి లబ్ది పొందాలని బిజెపి ప్రయత్నించిందని ఆయన తెలిపారు. అయోధ్య రామాలయాన్ని చూపి ఓట్లు దండుకోవాలని చూస్తే చివరకు రామాలయం ఉన్న ఎంపి స్థానం ఫైజాబాద్‌ను బిజెపి కోల్పోయిందన్నారు. ఈ ఎన్నికలు మతోన్మాద శక్తులకు ఒక హెచ్చరిక లాంటివని నారాయణ తెలిపారు. బలమైన ప్రతిపక్షం లోక్‌సభలో ఉండడాన్ని సిపిఐ స్వాగతిస్తుందని ఆయన తెలిపారు. రాష్ట్రంలో ప్రధాన సమస్యల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి సారించాలని నారాయణ సూచించారు. రైతుబంధు, రుణమాఫీ తో పాటు ఇతర ప్రజా సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. బొగ్గు బ్లాకుల వేలాన్ని అడ్డుకునేందుకు జరుగుతున్న పోరాటాల్లో కాంగ్రెస్ పార్టీ ముందు వరుసలో నిలవాలన్నారు. కేంద్రాన్ని నిలువరించేందుకు ఇది సరైన మార్గమని ఆయన అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోను బొగ్గు బావుల ప్రైవేటీకరణను అడ్డుకుంటామని బొగ్గు బ్లాకుల వేలం పాటలను తక్షణం నిలుపుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ విస్తరణ బలోపేతం పై దృష్టి సారించనున్నామని నారాయణ తెలిపారు. గ్రామశాఖల బలోపేతమే లక్ష్యంగా కార్యాచరణ రూపొందించనున్నామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ క్యాడర్‌ను సంసిద్ధం చేస్తున్నామని ఆయన తెలిపారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టగా ఈ సమావేశంలో సిపిఐ జాతీయ కార్యదర్శి అజీజ్ పాషా, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి పాల్గొన్నారు.

## స్వీపర్ల సమస్య ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తా : కూనంనేని

**ప్రజాపక్షం/ ఖమ్మం :** కరోనా సమయంలో విధుల నుంచి తొలగించిన పాఠశాల స్వీపర్ల సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేయనున్నట్లు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు. 2015లో స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా రూ. 2,500 కనీస వేతనంతో సర్వీస్ పర్సన్స్ స్వీపర్లను విద్యార్థుల సంఖ్యను బట్టి ప్రభుత్వం నియమించిందని రాష్ట్ర వ్యాప్తంగా 27వేల మంది స్వీపర్లను గత ప్రభుత్వం తొలగించిందని ఆయన తెలిపారు. శుక్రవారం ఏఐటియుసి ఆధ్వర్యంలో స్వీపర్లను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ ప్రభుత్వంపై ఒత్తిడి తేవాల్సిందిగా విజ్ఞప్తి చేస్తూ సాంబశివరావుకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ స్వీపర్లను తొలగించడం వల్ల పాఠశాలల్లో అపరిశుభ్ర వాతావరణం నెలకొని విద్యార్థులు అనారోగ్యాల పాలయ్యే అవకాశం ఉందన్నారు. పాఠశాలల్లో పరిశుభ్రత, పచ్చదనం ముఖ్యమని ఈ రెండింటి దృష్ట్యా సర్వీస్ పర్సన్స్‌ను విధుల్లోకి తీసుకోవాలన్నారు. ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి శింగు నర్సింహారావు, తెలంగాణ సర్వీస్ పర్సన్స్ గౌరవ అధ్యక్షురాలు సిహెచ్ సీతామహాలక్ష్మి, జిల్లా అధ్యక్షురాలు మీరాబీ, జిల్లా కార్యదర్శి రషీద్, మలేకా, అనూష, ఉమా మహేశ్వరి, కృష్ణవేణి, కమలమ్మ తదితరులు వినతి పత్రం సమర్పించిన వారిలో ఉన్నారు.

# బడి వైపు.. గిరిజనం చూపు



(మొదటిపేజీ తరువాయి)
నడుమ తమదైన అటవీక జీవితానికి అలవాటుపడిపోయారు. కాని మా తరం ఇలా గడిచిపోయింది. వచ్చే తరమైన చదువుకోవాలన్న ఆలోచన ఆదివాసీలలో ఇప్పుడిప్పుడే మొదలైంది. ముఖ్యంగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా పరిధిలోని దుమిరిపాల్ గ్రామం ఇప్పుడు వార్తలకెక్కింది. ఇక్కడ ఇటీవల పోలీసులు జరిపిన కాల్పుల్లో తల్లి చనుపాలు తాగుతున్న ఓ ఆరు నెలల బాలుడు మృతి చెందడం ఈ గ్రామం వెలుగులోకి రావడానికి కారణమైంది. దుమిరిపాల్‌లో ఒక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉంది. వేసవి సెలవుల అనంతరం తిరిగి పాఠశాల తెరిచారు. జిల్లా కేంద్రానికి 40 కిలో మీటర్ల దూరంలో ఉండే ఈ పాఠశాలకు వెళ్లేందుకు పిల్లలు నిరాకరించారు. గతంలో అయితే పిల్లలను బడికి పోమ్మని తల్లిదండ్రులు చెప్పేవారే కాదు. తమ వెంట అడవికి తీసుకుపోయి వారి జీవితాన్ని అడవిపాలే చేసేవారు. కాని దుమిరిపాల్ గ్రామాన్ని అధికారులు, మీడియా ప్రతినిధులు సందర్శించడంతో గ్రామ ప్రజల్లో కొంత ఆలోచన ప్రారంభమైంది. తమ పిల్లలను కూడా చదివించాలన్న ఆలోచన మొలకెత్తింది. ఇప్పుడిప్పుడే తమ పిల్లలు బడికి వెళ్లమని మారం చేస్తే బలవంతంగా పాఠశాలకి తీసుకెళ్లి ఉపాధ్యాయులకు అప్పగిస్తున్నారు. ఒక మహిళ తమ కుమారుడు బడికి వెళ్లనని మారం చేస్తే ఈడ్చుకెళ్తున్న ఓ ఫోటో బాగా వైరల్ అయింది. ఇలా ఒకరిని చూసి ఒకరు పాఠశాలకు తమ పిల్లలను పంపిస్తున్నారు. గిరిజనుల్లో వచ్చిన ఈ మార్పు ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశమైంది. నాగరిక ప్రపంచానికి దూరంగా బతికే ఈ గిరిజనం బడి బాట పట్టడం పలువురిని ఆశ్చర్యానికి గురి చేసింది. ఈ మార్పు వస్తేనే అభివృద్ధి చెందుతారంటూ ఆదివాసీలను చైతన్యపరిచే కార్యక్రమంలో ఉన్నారు.

# గోదావరి జలాలు అంకమ్మ చెరువుకు తెస్తాం

(మొదటిపేజీ తరువాయి)
అవసరాలు ఉన్నాయని, కేవలం దేశంలో 3.96లక్షల మెట్రిక్ టన్నుల ఆయిల్ మాత్రమే మన దేశంలో సమకూర్చుకోగలుగుతున్నామన్నారు. ఇంకా మన దేశంలో 97.1శాతం ఆయిల్ అవసరాలను దిగుమతులు చేసుకుంటున్నామన్నారు. ఈ ప్రాంతంలో 35ఏళ్లుగా ఫామాయిల్ సాగు చేస్తున్నామన్నారు. అయినప్పటికీ ధర స్థిరికరణంలో కొంత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయం కారణంగా ఎచ్చుతగ్గులు ఉండటంతో రైతులు సాగు పట్ల ఆలసత్వం చేయకుండా సాగు పెంచేందుకు ధర కనీసం రూ.15వేలకు తగ్గకుండా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ధర స్థిరికరణ ప్రయత్నం చేస్తామన్నారు. కొత్తగూడెం జిల్లాను ఫామాయిల్ హబ్‌గా మార్చేందుకు కృషి చేస్తామన్నారు. పాత వంగడాల వలన చెట్లు ఎత్తుగా పెరగటం వలన కోత సమయంలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయంపై తక్కువ ఎత్తు పెరిగే కొత్త వంగడాలను పరిశీలిస్తున్నామన్నారు. దేశంలో ఫామాయిల్ సాగు 11లక్షల ఎకరాల్లో సాగు ఉందని, రాష్ట్రం సుమారు ఈ ఏడాది 2లక్షల ఎకరాల సాగు చేపట్టేందుకు టార్గెట్‌గా పెట్టుకున్నామన్నారు. ఇప్పటికే రైతులకు ప్రోత్సహం కింద ఎకరాకు రూ.50వేలు సబ్సిడీ ప్రభుత్వం అందిస్తుందన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల వ్యవసాయ మంత్రుల సమన్వయంతో ఫామాయిల్ సాగు ఫ్యాక్టరీల నిర్మాణాలు తదితర అంశా



లపై చర్చించి ముందుకు సాగటం జరుగుతుందని తెలిపారు. ఎమ్మెల్యే జారే మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతం కావటంతో గిరిజనేతర రైతులకు కొన్ని భూముల హక్కు పత్రాల విషయంలో ఇబ్బందులు ఉన్నాయని, సాగులో ఉన్నవారికి పోడు హక్కులు పొందిన వారికి సైతం నీరు, విద్యుత్ సౌకర్యంతో పాటు ఫామాయిల్ సాగు చేసేందుకు వీలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఫామాయిల్ అధికారులు సుధాకర్‌రెడ్డి, బాలకృష్ణ, నాగబాబు, కాంగ్రెస్ నాయకులు చెన్నకేశవరావు, జూపల్లి ప్రమోద్, సత్యనారాయణచౌదరి, రాంబాబు, ఆలా నాగేశ్వరరావు, నార్లపాటి సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

# పట్టా భూముల్లో ప్రభుత్వ బోర్డులు



(మొదటిపేజీ తరువాయి)
బోర్డులు ఏర్పాటు చేశారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విచారణ చేసి మా పట్టా భూములను మాకు అప్పగించాలని కోరుతున్నారు. ఖమ్మం కార్పోరేషన్ పరిధిలోని వెలుగుమట్ల రెవెన్యూలో రాజన్నపేట గ్రామం ఉండేది. 14వ డివిజన్‌లో గల రాజన్నపేట గ్రామ ప్రజలకు మూడు దశాబ్దాల క్రితం గొల్లగూడెం సమీపంలో నివాస స్థలాలను కేటాయించారు. గ్రామం చుట్టూ బురద ఉండడం గ్రామం నుంచి బయటకు వచ్చే పరిస్థితులు ఆనాడు లేకపోవడంతో అప్పటి శాసన సభ్యుడు రజబ్‌అలీ చొరవతో కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులు నివాస స్థలాలను కేటాయించారు. పాత రాజన్నపేటలో ఉన్న నివాస స్థలాలకు సంబంధించి రైతుల పేరునే పట్టాదారు పాసుపుస్తకాలు కొనసాగుతున్నాయి. ఇప్పుడు మారిన పరిస్థితుల్లో పాత రాజన్నపేట కు రహదారి సౌకర్యం రావడం ఇదే సమయంలో కుటుంబాలు పెరగడంతో కొందరు కుటుంబ సభ్యులు పాత రాజన్నపేటలోని వారి నివాస స్థలాల్లో జీవించేందుకు రేకుల షెడ్లు నిర్మించుకున్నారు. ఏం జరిగిందో కాని రెవెన్యూ అధికారులు ఆ ఇండ్లను కూల్చేసి ఇది ప్రభుత్వ భూమి అని బోర్డు ఏర్పాటు చేసి చుట్టు పెన్సింగ్ ఏర్పాటు చేశారు. వాస్తవానికి ప్రభుత్వ భూమిగా నిర్ధారించిన దానిలో షేక్ నజీర్ పాషా, షేక్ గోరేబీ, పర్సా సోమయ్య, షేక్ దస్తగిరి సహా చాలా మంది రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు ఉన్నాయి. అనేక సంవత్సరాలుగా భూమి వారి పేరునే రికార్డుల్లో నమోదైంది. 2018లో



తెలంగాణ ప్రభుత్వం పట్టాదారు పాసుపుస్తకాలను సైతం అందించింది. బాధితులు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి ని కలిసి తమ పేరున పట్టాలు ఉన్న భూములను తమకే అప్పగించాలని వేడుకున్నారు. కొందరు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ తమను ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు.

**భూములను పరిశీలించిన సిపిఐ నాయకులు...**

పట్టాదారు భూముల్లో ప్రభుత్వ భూములుగా నమోదు చేసి హద్దులు నిర్ణయించడాన్ని సిపిఐ నాయకులు తీవ్రంగా ఖండించారు. బాధితుల కోరిక మేరకు శుక్రవారం సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, రాష్ట్ర సమితి సభ్యులు ఎస్‌కె జానిమియా, జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్ తదితరులు భూములను పరిశీలించారు. ఇప్పటికీ అక్కడ శిథిలావస్థలో ఉన్న ఇండ్లు ఉండటాన్ని వారు గమనించారు. అనేక దశాబ్దాలుగా వారి ఆధీనంలో ఉన్న భూములకు ప్రభుత్వ భూములని బోర్డులు ఏర్పాటు చేయడం సరైంది కాదన్నారు. పట్టాదారు పాసుపుస్తకాలు కలిగిన రైతులకు భూములను అప్పగించాలని ఈ విషయమై మంత్రులకు, ఉన్నతాధికారులకు తెలియజేస్తామని మౌలానా తెలిపారు. చిన్న, సన్నకారు రైతులు ఎక్కువగా ఉన్నారని ప్రభుత్వం ఆలోచన చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ వలరాజు, బాధిత రైతులు షరీఫ్, నజీర్, నన్నెమియా, జానిమియా, పర్సా సోమయ్య, రజ్జు తదితరులు పాల్గొన్నారు.

# నెంబరు ప్లేట్లు లేకుంటే కేసులు నమోదు

## పోలీస్ కమిషనర్ సునీల్ దత్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** నెంబర్ ప్లేట్లు లేకుండా వాహనాలు నడిపితే ఐపిసి సెక్షన్ 420 కింద కేసులు నమోదు చేస్తామని ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. శుక్రవారం ఖమ్మం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను సిపి సునీల్ దత్ సందర్శించారు. నగరంలో నెంబర్ ప్లేట్లు లేకుండా తిరుగుతూ పట్టుబడిన 45 మంది ద్విచక్ర వాహనదారులతో సిపి మాట్లాడి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ ఇటీవల కాలంలో చైన్ స్నాచింగ్, దొంగతనాలు చేసే నిందితులు పోలీసుల నుండి, సిసి కెమెరాల నుండి తప్పించుకునేందుకు ద్విచక్ర వాహనాల నెంబర్ ప్లేట్లను తొలగిస్తున్నారని సిపి తెలిపారు. అదేవిధంగా చోరీ చేసిన వాహనాలతోనే నేరాలు ఎక్కువ చేస్తున్నారని సిపి అన్నారు. దొంగిలించిన వాహనాలకు నకిలీ పత్రాలు సృష్టించి తక్కువ ధరలకు విక్రయిస్తారని దీనిని దృష్టిలో పెట్టుకుని ఎవరైనా వ్యక్తులు వాహనాల కొనుగోలు, అమ్మకాలు చేసినట్లయితే ఖచ్చితంగా రిజిస్ట్రేషన్ మార్పు చేసుకోవాలన్నారు. లేదంటే ఏదైనా నేరాలలో మీ వాహనాలు ఉన్నట్లు గుర్తిస్తే సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమించి జరిమానాలు తప్పించుకునేందుకు నెంబర్ ప్లేట్లను వంచినా, ముసుగు వేసినా, పూర్తిగా లేకుండా చేసినా వారిని గుర్తించి వారి వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేయాలని ట్రాఫిక్ పోలీసులను ఆదేశించారు. ప్రస్తుతం నెంబరు లేకుండా పట్టుబడిన వాహన పత్రాలు, ఛాయిస్ నెంబర్లను తనిఖీ చేయాలని అలాగే చోరీకి గురైన వాహనాలు ఏమైనా ఉన్నాయో లేవో పరిశీలించాలన్నారు. నెంబరు ప్లేట్లు లేకుండా వాహనాలు నడుపుతున్న వారిలో యువతే ఎక్కువని ఈ విషయంలో తల్లిదండ్రులు తమ పిల్లలను అప్రమత్తం చేయాలన్నారు. నెంబరు ప్లేట్లు తారుమారు చేసినా, నెంబరు ప్లేట్లు లేని వాహనాలను ఎక్కడ పడితే అక్కడ సీజ్ చేయాలన్నారు. నెంబరు ప్లేట్లను బిగించిన తర్వాతే వాహనాలను ఇవ్వాలని ఆదేశించారు. మైనర్ డ్రైవింగ్, ర్యాష్ డ్రైవింగ్ పై మరింత దృష్టి పెట్టాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇచ్చినా ఎంవి యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ సెక్షన్ల కింద నేరం రుజువైతే జైలుశిక్ష లేదా జరిమానా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసిపి శ్రీనివాసులు, సిఐ మోహన్‌బాబు, ఎస్ఐ రవి, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆసుపత్రులు నిబంధనలు పాటించాలి

## -రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలి
## -డిఎంఅండ్‌హెచ్‌వో మాలతి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జిల్లాలో ఉన్న అన్ని ఆసుపత్రులు విధిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, నిబంధనలు పాటించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ బి. మాలతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఆసుపత్రి తప్పనిసరిగా క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ నిబంధనలకు లోబడి పని చేయాలన్నారు. ఆసుపత్రులలో ధరల పట్టికను, సిబ్బంది వివరాలు, సేవల వివరాలు ఖచ్చితంగా ఏర్పాటు చేయాలని ఆమె తెలిపారు. ఫైర్, బయో మెడికల్ వేస్ట్, సంబంధిత అనుమతులు ఖచ్చితంగా ఉండాలని, రికార్డులు మెయింటెన్ చేయాలన్నారు. సెల్లార్స్ నిబంధనలను అతిక్రమించి ఎలాంటి ల్యాబ్, ఎక్స్‌రే లు నడప రాదని, ఆపరేషన్ల థియేటర్లలో కల్చర్, సెన్సిటివిటి, ఫ్యూమిగేషన్ రిజిస్టర్లు మెయింటెన్ చేయలన్నారు. స్కానింగ్ సెంటర్లు తప్పనిసరిగా అనుమతి తీసుకుని నడపాలని, ఫామ్ ఎఫ్ రిజిస్ట్రేషన్‌ను నిబంధనల ప్రకారం మెయింటెన్ చేయాలన్నారు. జిల్లా వైద్యశాఖకు ప్రతి నెల తప్పనిసరిగా సబ్‌మిట్ చేయాలన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు క్రిమినల్ చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అనుమతులు లేకుండా అబార్షన్లు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని డిఎంఅండ్‌హెచ్‌వో తెలిపారు. ఐవిఎఫ్ సెంటర్లను క్రమం తప్పకుండా తనిఖీలు చేయడం జరుగుతుందని నిబంధనలు పాటించని వారి రిజిస్ట్రేషన్ క్యాన్సిల్ చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి ఆసుపత్రిలో తప్పనిసరిగా క్యాలిఫైడ్ స్టాఫ్‌ను నియమించుకోవాలని, ప్రతి పెషంట్ సంబంధిత రికార్డును ఐదు సంవత్సరాలు భద్రపర్చాలి, ప్రతి పెషంట్ ఫైనల్ బిల్స్‌ను, ఆసుపత్రిలో అడ్మిషన్ నుంచి డిశ్చార్జ్ వరకు ఐదు సంవత్సరాలు కంప్యూటర్‌లో భద్రపర్చాలని ఆమె తెలిపారు.

# విద్యార్థులకు మెరుగైన విద్య, భోజనం అందించాలి

## జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్‌రాజు



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన విద్య, నాణ్యత భోజనం ను అందించాలని జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్‌రాజు అన్నారు. మండలం లోని చెరువుమాధారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్నం భోజనం ను పరిశీలించారు. నాణ్యత గురించి విద్యార్థులను, ఉపాధ్యాయులను, ఏజెన్సీ నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులకు వెళ్లి విద్యార్థుల సామార్థ్యం ను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు....ప్రభుత్వ పాఠశాల లో మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు. కార్పోరేట్ స్థాయిలో విద్యార్థులకు సౌకర్యాలు కల్పించేలా కృషి చేస్తామని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ మరికంటి ధనలక్ష్మి, ఎంపీడీఓ యం.యర్రయ్య, మండల పంచాయతీ అధికారి శివ, డీసీఎంఎస్ డైరెక్టర్ నాగుబండి శ్రీనివాసరావు, బీఆర్ఎస్ నాయకులు పెద్దపాక వెంకటేశ్వర్లు, మరికంటి రేణుబాబు, కుక్కల సామేలు తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూ గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాపక్షం-నేలకొండపల్లి :** రెవిన్యూ సమస్యల పరిష్కారం కోరకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గ్రామ సభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని నేలకొండపల్లి డిప్యూటీ తహశీల్దార్ ఇమ్రాన్ సూచించారు. మండలం లోని బైరవునిపల్లి లో శుక్రవారం రెవిన్యూ గ్రామ సభ ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...రెవిన్యూ సమస్యల పరిష్కారం కోరకు రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచనలు మేరకు ప్రత్యేక గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు పేర్కోన్నారు. గ్రామంలో వివిధ సమస్యల పై 7 ధరఖాస్తులు అందినట్లు తెలిపారు. వీటిని సమగ్రంగా పరిశీలించి పరిష్కారిస్తామని అన్నారు. మండలం లో వచ్చే నెల 5 వరకు జరిగే గ్రామ సభలను రైతులు వినియోగించుకోవాలని అన్నారు. రెవిన్యూ కు సంబంధించిన సమస్యల పై దరఖాస్తులు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు, గోర్రెల, మేకల పెంపకందారుల సహాకార సంఘం అధ్యక్షుడు మల్లేబోయిన ఉపేందర్, కాంగ్రెస్ నాయకులు గోళ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



# నూతన ఆర్థిక విధానాల రూపశిల్పి పివి

## -ఘనంగా పివి నర్సింహారావు జయంతి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** నూతన ఆర్థిక విధానాల రూప శిల్పి, భారత మాజీ ప్రధాని పివి నర్సింహారావు అని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తెలిపారు. భారతదేశ మాజీ ప్రధాని పివి నర్సింహారావు జయంతిని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం సంజీవరెడ్డి భవన్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పివి నర్సింహారావు చిత్ర పటానికి పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తో పాటు మేయర్ పునుకొల్లు నీరజ, రాయల నాగేశ్వరరావు, పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పువ్వాళ్ల మాట్లాడుతూ బహు భాషా కోవిధుడు, నూతన ఆర్థిక విధానాల రూప శిల్పి పివి నర్సింహారావు అని తెలిపారు. దేశ ఆర్థిక వ్యవస్థను పటిష్ట పరిచేందుకు ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వడ్డెబోయిన నర్సింహారావు, రబ్బాని, కొత్తా సీతారాములు, ముజాహీద్, బొందయ్య, కార్పొరేటర్లు మలీదు వెంకటేశ్వర్లు, దుద్దుకూరి వెంకటేశ్వర్లు, లకావత్ సైదులు, రాపర్తి శరత్, అంజిరెడ్డి, భూక్యా బాలాజీ నాయక్, వెంకన్న, సూర్యనారాయణ, శెట్టి రంగారావు, ఎండివై పాషా, బీరెడ్డి రమేష్, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎంపిపి



**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ మండలం లోని అన్నారుగూడెం గ్రామానికి చెందిన అలవాల కాటయ్య(లేటు), కమలమ్మ దంపతుల కుమారుడు నాగరాజుకు గరికపాడు గ్రామానికి చెందిన స్వాతితో వివాహం జరిగింది. శుక్రవారం గ్రామంలోని మహాలక్ష్మమ్మ కల్యాణ మండపంలో రిసెప్షన్ వేడుక నిర్వహించగా తల్లాడ ఎంపిపి దొడ్డ శ్రీనివాసరావు హాజరై నూతన వధూవరులకు అక్షింతలు వేసి దీవించారు. నిండునూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట బిఆర్ఎస్ పార్టీ తల్లా మండలం ఎస్సీసెల్ ఉపాధ్యక్షులు ఇస్నపల్లి శ్రీనివాసరావు, బుల్లి రాములు, యువరాజ్, తాళ్ళూరి సాంబ, అలవాల బసవయ్య, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

# తల్లాడ మండలంలో మంత్రి తుమ్మల పర్యటన



**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ మండలంలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం పర్యటించారు. మండలంలోని బిల్లుపాడు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జక్కంపూడి కృష్ణమూర్తి ఇటీవల అవస్వస్థతకు గురికాగా ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా తల్లాడలో కాంగ్రెస్ నాయకులు రాయల నర్సింహారావు తనయుడు జిల్లా యువజన కాంగ్రెస్ నాయకులు రాయల రాము ఆహ్వానం మేరకు వారి ఇంటిలో జరిగిన తేనేటి విందు కార్యక్రమంలో మంత్రి తుమ్మల పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మలకు ఘన స్వాగతం పలికారు. అనంతరం మండలంలోని పలు విషయాలను మంత్రి నాగేశ్వరరావు చర్చించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థినికి అభినందనలు



**ప్రజాపక్షం/కారేపల్లి:** ప్రాథమిక పాఠశాల పోలంపల్లిలో ఐదో తరగతి ప్రవేశానికై బెస్ట్ అవైలబుల్ స్కూల్ ఎలక్షన్‌లో బేబిమూన్ ఖమ్మం స్కూల్‌లో సెలెక్ట్ అయిన జబ్బ వినిలాకు శుక్రవారం ప్రధానోపాధ్యాయులు అజ్మీర వీరునాయక్, సహ ఉపాధ్యాయులు కామల్ల సుందర్ టిసి ఇచ్చి అభినందనలు తెలిపారు. తోటి విద్యార్థులు అభినందనలు తెలిపారు. ఐదో తరగతిలో 2/2 ఒక విద్యార్థికి ఆల్‌రెడీ గురుకులంలో సీటు సంపాదించింది. మరో విద్యార్థి వినిలాకు బెస్ట్ అవైలబుల్ స్కూల్ బేబిమూన్ ఖమ్మం సెలెక్ట్ అయింది. గత 5 అవసరాల నుండి ప్రాథమిక పాఠశాల పోలంపల్లిలో ఐదో తరగతిలో ప్రవేశానికై ప్రతి విద్యార్థికి వివిధ గురుకులాల్లో సీటు సంపాదించడం ఆనవాయితీగా మారింది.

# స్పెల్ బి విజేతలకు బహుమతి ప్రదానం

**ప్రజాపక్షం/ మధిర :** మధిర పట్టణంలోని టివిఎం హైస్కూల్‌లోని 8వ తరగతి విద్యార్థులకు స్పెలబీ పరీక్ష నిర్వహించి మంచి ప్రతిభ కనబర్చిన నలుగురు విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. పాఠశాల పూర్వ విద్యార్థి డాక్టర్ వెంకట రామారావు శుక్రవారం టివిఎం స్కూల్‌ను సందర్శించి 8వ తరగతి విద్యార్థులకు సెల్ప్ బి పరీక్ష నిర్వహించారు. దీనిలో ప్రతిభ కనబర్చిన నక్షత్ర, సిరిచందన, నజీమ్, లీలా ప్రసాద్ అనే విద్యార్థులకు చేతి గడియరంతో పాటు రూ.500నగదు పురస్కారం అందచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు అన్ని పోటీ పరీక్షల్లో, క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థి సంఘం కార్యదర్శి మాధవరపు నాగేశ్వరరావు, హెచ్‌ఎం ప్రభాకర్‌రావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలి




**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన వాగ్ధనాలను వెంటనే అమలు చేయాలని సిపిఎం మండల పార్టీ కార్యదర్శి నంద్ర ప్రసాద్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఖమ్మం రూరల్ మండలంలోని తెల్దారుపల్లి గ్రామంలో పార్టీ జనరల్‌బాడీ సమావేశాన్ని కామ్రేడ్ మర్రి సన్మతరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...బడుగు,బలహీన వర్గాలకు చెందిన ప్రజలు, రైతులు, యువత అందరిని దృష్టిలో ఉంచుకుని వారికి అన్ని విధాల సహకరించాలని ప్రభుత్వం తరపున విడుదలయ్యే అన్ని సంక్షేమపథకాలు అందించి,వారిని అభివృద్ధిలోకి తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా గ్రామ మాజీ సర్పంచ్ సిద్ధినేని కోటయ్య మాట్లాడుతూ...మాజీ సీఎం దివంగతనేత రాజశేఖర్‌రెడ్డి హయంలో సీతారామ ప్రాజెక్ట్ ఎత్తిపోతల పథకం శంకుస్థాపన చేయడం జరిగిందని, 10సంవత్సరాలు కావోస్తున్న పూర్తి కాలేదన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శివర్గ సభ్యురాలు పెండ్యాల సుమతి, మండలకమిటీ సభ్యులు రంజాన్‌పాషా, శాఖ కార్యదర్శులు గొడ్డేటి రాజేశ్వరి, సిరికొండ నగేష్, మల్లెబోయిన రాజశేఖర్, పార్టీ సభ్యులు మడిపల్లి వెంకన్న, పాము వెంకన్న, జలగం వెంకట్రావు, బోళ్ల ఉషా, సీతమ్మ, తోట సుజాత, పగిడిపల్లి ఉపేందర్, పాము ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన గ్రామాల్లో వైద్యశిబిరాలు



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** మండల పరిధిలోని మారుమూల గిరిజన గ్రామాల్లో శుక్రవారం వైద్య శిబిరాలు నిర్వహించారు. మోరంపల్లిబంజర్ పిహెచ్‌సి వైద్యురాలు లక్ష్మి సాహితి ఆధ్వర్యంలో చింతల కుంట లక్ష్మిగుంపు గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. మొత్తం 96 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. జ్వరంలో బాధపడుతున్న 5 గురికి రక్త పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. నలుగురు పిల్లలకు పిల్లలతో ఇబ్బంది పడుతున్న వారిని పరీక్షించి చికిత్స అందించారు. అనంతరం గ్రామాల్లోని పరిసరాలను పరిశీలించి గ్రామస్తులకు వ్యక్తిగత పరిశుభ్రతపై పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కాచి చల్లార్చిన నీటిని త్రాగాలని పరిసరాలలో నీటిని నిలువ ఉండకుండా చూడాలని వివరించారు. గ్రామంలో ఉన్న గర్భిణీ స్త్రీలు బాలింతలను పరీక్షించారు. వారికి తగు జాగ్రత్తలను సూచించారు. బీపీ షుగర్ బాధితులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈకార్యక్రమంలో హెచ్ఈవో రవి, హెచ్‌వి ఎస్ భవాని, ఎంఎల్‌హెచ్‌పి జీవన, హెచ్‌ఏ వెంకట్రావ్, ఏఎన్ఎం సుందర వేణి, ఆశ పద్మ తదితరులు పాల్గొన్నారు.

## జామకాయ రైతు దిగాలు



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** గత కొన్ని సంవత్సరాల నుండి జామకాయ సాగుతో జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ ఏడాది జామకాయలు పురుగులు ఉండటంతో రైతుకు నష్టం వాటిల్లింది. చంద్రుగొండ గ్రామ శివారులోని గుర్రాయిగూడెం వెళ్లే రహదారి మధ్యలో జానీమియా జామ సాగు చేస్తున్నాడు. ప్రతి ఏడాది మూడుసార్లు దిగుబడితో సుమారు 1,80,000రూపాయల ఆదాయం వస్తుందని రైతు జానీమియా అన్నారు. ఈ ఏడాది జామకాయలో పురుగు ఏర్పడటంతో జామకాయకు బుట్టలు గట్టిన ఫలితం లేదని, దీంతో రూ 18వేల పురుగు మందు పిచికారి చేసిన ఫలితం లేకపోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జామ సాగే జీవనాధారంగా కొనసాగిస్తున్నానని అన్నారు. జామ సాగుపై నష్టం వాటిల్లిందని దీనిని దృష్టిలో ఉంచుకొని ఆదుకోవాలన్నారు.

## మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు



**ప్రజాపక్షం/సుజాతనగర్:** తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని, తనిఖీల్లో పట్టుబడితే కొత్త చట్టాల ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని సుజాతనగర్ ఎస్ఐ జుబేదా బేగం తెలిపారు. సుజాతనగర్ మండల కేంద్రంలో వాహనదారులకు ప్రజలకు అవగాహన కల్పించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏదైనా గొడవలు జరిగినప్పుడు చదువుకునే విద్యార్థులు వాటికి దూరంగా ఉండాలని, కేసులు నమోదైతే ప్రభుత్వ ఉద్యోగాలకు అనర్హులవుతారన్నారు. ప్రతి ఒక్క వాహనదారుడు తప్పకుండా సరైన ధృవపత్రాలు కలిగి ఉండాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ రూల్స్ ను కచ్చితంగా ప్రతి ఒక్కరు పాటించాల్సిందేనని, లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలోహెడ్ కానిస్టేబుల్ కె.చంద్రశేఖర్, పి. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# మావోయిస్టుల అరాచకాలకు బలవుతున్న ఆదివాసీలు..!

**మావోయిస్టులు అమర్చిన ప్రెషర్ ఐఈడీ పేలి యువకుడి మృతి**

**ప్రజాపక్షం/కరకగూడెం:** కరకగూడెం నుండి రంగాపూరు వెళ్లె ప్రధాన రహదారి మేతె గ్రామ సమీపంలో ఎర్ర చెరువు వద్ద గురువారం రాత్రి మావోయిస్టుల ఆరాచకాలకు అమాయక ఆదివాసీలు బలి అవుతున్నారు అని, వారికి వ్యతిరేకంగా వాల్ పోస్టర్లు వెలిశాయి. ఆ కరపత్రాలలో ఈ విధంగా పేర్కొన్నారు. మావోయిస్టు అరాచకాలకు బలి అవుతున్న అమాయక ఆదివాసీలు బీజాపూర్ జిల్లాలోని మావోయిస్టు అమర్చిన ఐఈడీ పేలుడుతో నడపల్లి గ్రామానికి చెందిన జోగి అనే మహిళకు (50) తీవ్ర గాయాలు అయ్యాయి. అటవీ ఉత్పత్తులు సేకరించడానికి వెళ్లిన సమయంలో ఈ నెల 19న ఉదయం 6.30 గంటలకు ఈ ఘటన జరిగింది. జోగి ప్రమాదవశాత్తు ఐఈడీ పై కాలు పెట్టడంతో పేలుడు సంభవించింది, దీని వల్ల ఆమె కాళ్లు నుజ్జునుజ్జు అయ్యాయి. తమ ఉనికిని చాటుకునేందుకు సాధారణ ప్రజలును సైతం టార్గెట్ చేస్తూ కాలి బాటల వెంట మందు పాతరలు అమర్చి వారి ప్రాణాలు బలిగొంటున్నారు. మావోయిస్టులపై ఏదైనా జరిగినప్పుడు స్పందించే పౌర హక్కుల సంఘం నాయకులు సామాన్య ప్రజలకు అన్యాయం జరిగితే స్పందించడం లేదు ఎందుకు..?

**మావోయిస్టుల హింసకు అమాయక ఆదివాసీ యువకుని బలి...**

ఏప్రిల్ 20వ తేదీన పటేల్పార ముత్వెండి గ్రామం గంగలూర్ పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన 18 ఏళ్ల వయసున్న గడియ అనే యువకుడు







అటవీ ఉత్పత్తుల కోసం అడవికి వెళ్లి తిరిగిరాని లోకాలకు వెళ్ళాడు. మావోయిస్టులు అమర్చిన ప్రెషర్ ఐఈడీ పేలి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ దురహంకార, దుశ్చర్యకు కారకులు మావోయిస్టులు కాదా ? ఆదివాసుల అండతో బ్రతుకుతు ఆదివాసులని బలి తీసుకుంటుంది ఎవరు? గడియ కుటుంబాన్ని అంధకారం చేసింది ఎవరు ? మావోయిస్టు చనిపోతే రాదంతం చేసే ప్రజా సంఘాలు ఆదు మౌనం ఎందుకు? అని ఆ కరపత్రం లో పేర్కొన్నారు. వాల్ పోస్టర్లు ఎవరు వేశారో పోలీస్ శాఖ ధృవీకరించలేదు.

# మంచినీళ్లు ఇవ్వండి మహాప్రభో..!

**ఖాళీ బిందెలతో నిరసన**




**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** తాగునీటి ఇచ్చి అదుకోండి సారూ అంటూ గ్రామస్తులు రహదారిపై రాస్తారాకో నిర్వహించారు. వివరాలు ఇలా ఉన్నాయి. నేలకొండపల్లి మండలం లోని పైనంపల్లి గ్రామంలో గత కొన్ని రోజులు గా తాగునీటి సరఫరా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు అగ్రహించారు. శుక్రవారం ఖమ్మంకోదాడ రహదారి పై రాస్తారాకో నిర్వహించారు. మహిళలు ఖాళీ బిందెలతో నిర సన తెలిపారు. గ్రామంలో తాగునీటి సరఫరా అస్థవ్యస్థంగా మారిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు చెప్పినా పట్టిం చుకోవటం లేదని అగ్రహం వ్యక్తం చేశారు. చేసేది లేక ఖమ్మం కోదాడ రహదారి పై ఖాళీ బిందెలతో మహిళలలు రాస్తారాకో నిర్వహించారు. దీంతో రహదారికి ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. మంచినీరు సరఫరా చేయుకుంటే మేము ఎలా బ్రతకాలని ఆవేదన వ్యక్తం చేశారు. మిషన్ భగీరధ పథకం అస్తవ్యస్తం గా మారిందని పేర్కోన్నారు. ఆందోళన విషయం తెలుసుకున్న నేలకొండపల్లి ఎస్సై తోట నాగరాజు ఘటనా స్థలం కు చేరుకుని ఆందోళనకారులతో చర్చించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య ను పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. దీంతో ఆందోళనకారులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో పలువురు బాధితులు పాల్గొన్నారు.

# సీతారామ పంప్‌హౌస్‌ను పరిశీలించిన కలెక్టర్

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** అశ్వాపురం మండల పరిధిలోని బిజి కొత్తూరు సమీపంలో గల సీతారామ ఎత్తిపోతల పథకం పంప్‌హౌస్‌ను శుక్రవారం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ పరిశీలించారు. ఈ సందర్భంగా పంప్‌హౌస్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు మ్యాప్ ద్వారా ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను వివరించారు. ఈ పంపు ద్వారా 1500 క్యూసెక్కుల నీరు విడుదలవుతుందని, జిలాల్లో మొత్తం 4 పంపుల ద్వారా 104 కిమీ వరకు నీటిని పంపేందుకు ప్రధాన కాలువలు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. ఆగస్టు నెలలో నీటిని విడుదల చేసేందుకు అన్ని పనులు పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కాలువను ఏన్కూరు వద్ద నాగార్జున సాగర్ కాలువకు అనుసంధానం అవుతుందని, తద్వారా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 1.20 లక్షల ఎకరాలకు మొదటి విడత నీటి లభ్యత కలుగుతుందన్నారు. రానున్న మూడేళ్లలో విడతల వారీగా ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు మహబూబాబాద్ జిల్లాలో 6.74 లక్షల




ఎకరాలకు నీరు అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల సిఇ శ్రీనివాసరెడ్డి, సూపరింటెండెంట్ ఇంజనీర్లు వెంకటేశ్వర రెడ్డి, శ్రీనివాసరెడ్డి, కార్యనిర్వాహక ఇంజనీర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## వాహనాల దొంగ అరెస్ట్

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** కొత్తగూడెం పట్టణంలోని పోస్టాఫీస్ సెంటర్‌లో వాహనాల దొంగను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. సాధారణ వాహనాల తనిఖీల్లో భాగంగా వన్ టౌన్ ఎస్సై విజయ్ వాహనాలు తనిఖీలు చేస్తుండగా అనుమానాస్పందగా తారసపడిన వ్యక్తిని ఆపి ఆరా తీయగా పొంతలేని సమాధానం చెబుతుండటంతో గట్టిగా ప్రశ్నించారు. దీంతో పారిపోయేందుకు ప్రయత్నించడంతో పోలీసులు అదుపులోనికి తీసుకున్నారు. వివరాల ప్రకారం, గుంటూరు జిల్లా చెరువు మంగళగిరికి చెందిన సల్లా చంద్రశేఖర్ గత కొంత కాలంగా చుంచుపల్లి మండలం పరిధిలోని హౌసింగ్ బోర్డులో



ఉంటున్నాడు. ప్రతి నిత్యం ఆర్‌టిసి బస్టాండ్ సమీపంలో తిరుగుతూ మూడు బైకులను అపహరించాడు. అరెస్టు చేసిన రిమాండ్‌కు తరలించినట్లు సిఐ కరుణాకర్ తెలిపారు. కానిస్టేబుళ్లు ఘని, సురేష్, వీరన్న, నరేష్, ప్రసాద్‌లను ఆయన అభినందించారు.

# ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీ..!




**-ఇష్టానుసారంగా ఫీజుల వసూళ్లు**
**-పుస్తకాలు, స్టేషనరీ మా వద్దే కొనాలనే నిబంధన**
**-విద్యా హక్కు చట్టానికి తూట్లు..**
**-చూసిచూడనట్టు వ్యవహరిస్తున్న విద్యాశాఖ అధికారులు**
**-అయోమయంలో విద్యార్థులు తల్లిదండ్రులు**

**ప్రజాపక్షం/బూర్గంపాడు:** ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీ ప్రారంభమైంది. బూర్గంపాడు మండలంలోని ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యాల దోపిడీకి హద్దు అదుపు లేకుండా పోతోంది. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఉత్తమ విద్యను అదించాలన్న తపనను ఆసరాగా చేసుకుని ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు ఫీజులను ఇష్టం వచ్చినట్లు పెంచి వసూలు చేస్తున్నారు. గవర్నింగ్ బాడీ ద్వారా ఫీజులు నిర్ణయించి, అందరికీ కనిపించేలా పట్టికపైన ఉంచాల్సి ఉన్నా అదెక్కడా అమలు కావడం లేదు. పాఠశాల్లో పుస్తకాలు, స్కూల్ డ్రెస్‌లు అధిక ధరలకు విక్రయించరాదని ఇప్పటికే విద్యాశాఖ ఆదేశించినా ఎవరూ పట్టించుకోవడం లేదు. పైగా ఇవన్నీ తమ వద్దే కొనాలని తల్లిదండ్రులకు ఒత్తిడి చేస్తున్నారు. ఫీజులు నియంత్రణపై ప్రశ్నించేవారు లేకపోవడంతో యాజమాన్యాలు ఇష్టానుసారంగా ఫీజులు దోపిడీ చేస్తున్నారు. మండల పరిధజలోని ప్రైవేట్ పాఠశాలలు అధిక ఫీజులు ఇసూళ్లు చేస్తున్నాయంటూ ప్రతి ఏడాది విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక ఫిర్యాదులు వస్తున్నాయంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. విద్యా హక్కు చట్టానికి తూట్లు పొడుస్తూ విద్యను వ్యాపారంగా మార్చిన ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యలపై కఠిన చర్యలు తీసుకోవాలన్న డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి.

**నిబంధనలకు నీళ్లు....**

ప్రతి ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం గుర్తింపు పొందే సమయంలో ఒక ట్రస్టును ఏర్పాటు చేసుకొని తద్వారా గుర్తింపు పొందాలి. ఒక గవర్నింగ్ బాడీని ఏర్పాటు చేసి అందులో ఒక ఉపాధ్యాయుడిని, ప్రధానోపాధ్యాయుడిని, పాఠశాల కరస్పాండెంట్‌ను, ఛైర్మన్‌ను, ఇద్దరు పేరెంట్స్‌ను నియమించాలి. గవర్నింగ్ బాడీ ద్వారా ఫీజులు ఎంత వసూలు చేయాలో నిర్ణయించి ఆ ఫీజుల వివరాలను అందరికీ కనిపించేలా పట్టికపైన ఉంచాలి. మండలంలోని ఒక్క పాఠశాల కూడా పట్టిక పైన ఫీజులను డిస్‌ప్లే చేయడం లేదు. గవర్నింగ్ బాడీలో పాఠశాల యాజమాన్యానికి అనుకూలమైన వారిని సభ్యులుగా చేర్పి గవర్నమెంట్ బాడీ తతంగాన్ని మమ అనిపిస్తున్నారు. యాజమాన్యాన్ని ఫీజులను నియంత్రించే వారు లేక, ప్రశ్నించే వారు లేక వారి ఇష్టానుసారంగా ఫీజులను వసూలు చేస్తున్నారు.

**అమాంతం పెంచేశారు...**

బూర్గంపాడు మండలంలోని పేరుపొందిన ప్రైవేట్ పాఠశాలు ఫీజులను అమాంతం పెంచేశారు. గత ఏడాది ఉన్న ఫీజులకు 25 నుండి 30శాతం పెంచారు. నర్సరీ చదివే విద్యార్థికి ఇంజనీరింగ్ స్టూడెంట్‌కు అయ్యే ఖర్చును మరిపిస్తున్నాయి. ఫీజుల పెంచడం ద్వారా విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


**ఇన్‌చార్జ్ ఎంఈవో పాలనతో ఇబ్బందులు...**

బూర్గంపాడు మండలంలో ప్రైవేట్ దందా జోరుగా సాగుతోందని, అయినా కానీ నేటికి ఇన్‌చార్జ్ ఎంఈవో నోరు మెదపకపోవడం విడ్డూరంగా ఉందని పలువురు బాహాటంగా చర్చించుకుంటున్నారు. మండలంలో ఇష్టానుసారంగా ప్రైవేట్ యాజమాన్యం విద్యార్థుల తల్లిదండ్రుల జేబులను గుల్ల చేసేలా ఫీజులను వసూళ్లు చేస్తుంటే కనీసం పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తున్న ఆయన తీరు పలు అనుమానాలకు తావిస్తోంది. నెల వారీ ముడుపులు అందటంతోనే మండలంలో ఈ విధంగా ప్రైవేట్ దందా సాగుతోందనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. అసలు ప్రతి ప్రైవేట్ పాఠశాలలో ఏ తరగతికి ఎంత ఫీజు తీసుకుంటారో అనే పట్టిక బోర్డులు లేకపోవడం కోసమెరుపు.

**జిల్లా కలెక్టర్ దృష్టి సారించాలి...**

మండలంలో ప్రైవేట్ దందాతో విద్యార్థులు తల్లిదండ్రులు పడుతున్న ఇబ్బందులపై విద్యా శాఖ అధికారులు తమకేమి సంబంధం లేదు అన్నరీతిలో వ్యవహరిస్తున్నారు. ఈవిషయంపై జిల్లా కలెక్టర్ స్పందించి మండలంలో జరుగుతున్న ప్రైవేట్ దందాను అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు కోరుతున్నారు..

# వరుస దొంగతనాలతో బెంబేలు..!




**-ప్రతిరోజు ఏదో ఒకచోట చోరీ**
**-తిరుమలాయపాలెం పోలీసులు ఉన్నట్టా లేనట్టా...?**
**-నమ్మకం కోల్పోతున్న పోలీసులు**




**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** వరుస దొంగతనాలతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఇంటి నుంచి బయటకు వెళ్లాలంటే ఎటునుంచి దొంగల రూపంలో ఏ ముప్పు సంభవిస్తుందోనని అన్న భావనతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇల్లు విడిచి వెళ్లాలంటే ఇంట్లో పడతారా ఒంటరిగా వెళ్లాలంటే వ్యక్తులపై దాడి చేస్తారన్న భయంతో గడగడలాడుతున్నారు. గడిచిన రెండు నెలల కాలంలో ఎన్నో విధాలుగా దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఒంటరిగా ఉన్న మహిళలను బంగారు ఆభరణాలు వేసుకొని ఒంటరిగా వెళ్తున్న వ్యక్తులు టార్గెట్ చేస్తూ మారణ ఆయుధాలతో బెదిరించి ప్రజల వద్ద నుండి బంగారు ఆభరణాలు లాక్కొని వెళ్ళిపోతున్నారు. గురువారం మధ్యాహ్నం రైతు వద్ద నుండి కత్తులతో బెదిరించి మూడు తులాల బంగారు ఆభరణాలు తీసుకువెళ్లి మరుసటి రోజు పిండిప్రోలు సమీపంలో నూతన భారత్ పెట్రోల్ బంకు వద్ద ఆగి ఉన్న లారీ నుండి 240 లీటర్ల డీజిల్ డీసీఎం వాహనంలో 100 లీటర్ల డీజిల్ ని దొంగలు కారులో వచ్చి పైపుల ద్వారా డీజిల్ ని తీసుకొని పరారయ్యారు. వారికి పోలీసులు అంటే అసలు భయమే లేదు వారి కారులో వచ్చి డీజిల్ ని చోరీ చేసేదంతా సీసీ కెమెరాలు రికార్డు అయినది అదే బంకు వద్ద వరుస డీజిల్ దొంగతనాలతో వాహనదారులు లక్షల రూపాయలు పోగొట్టుకున్నారు. రెండు సంవత్సరాల కాలంలో స్థానిక పోలీస్ స్టేషన్లో ఎందరో ఎస్సైలు మారారు కానీ ఏ ఒక్క దొంగతనాన్ని సేదించలేకపోయారు. తిరుమలాయపాలెం మండల కేంద్రంలో ఉన్న డిసిసిబి బ్యాంకులో వరుస దొంగతనాలకు పాల్పడి ఏటీఎం కంప్యూటర్లను ధ్వంసం చేసి 15 రోజుల గ్యాప్ లో మూడు సార్లు చోరీకి పాల్పడి పోలీసులకు దొంగలు అప్పుడు సవాలు విసిరారు. ప్రస్తుతం వరుస దొంగతనాలతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. దీన్నంతటికి రాత్రి సమయాలలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించడం ఖమ్మం వరంగల్ జాతీయ రహదారి ప్రధాన కోడళ్ళు లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. యువకులు మత్తు పదార్థాలకు బానిసవుతూ క్రికెట్ పోటీలో బెట్టింగులు కాస్తు ఎన్నో విధాలుగా తమ అమూల్యమైన జీవితాన్ని ఆదిలోనే అంతం చేసుకుంటున్నారు. ప్రజల్లో చైతన్యవంతం కల్పించడం ఎన్నో కార్యక్రమాలు పోలీస్ అధికారులు చేయాల్సి ఉండగా ఇంతవరకు ఏ ఒక్క అవగాహన కార్యక్రమం కూడా చేపట్లేదు పోలీసులపై ప్రజలకు నమ్మకం కలగాలంటే ఇప్పటికైనా రాత్రి సమయాలలో పెట్రోలింగ్ నిర్వహించాలని డయల్ 100 కి ఫోన్ చేస్తే వెంటనే స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

## వానదారుల ఇక్కట్లు



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** వర్షం కురిస్తే వాహనదారులు, పాదచారులకు ఇక్కట్లు తప్పడం లేదు. వివరాలు ఇలా ఉన్నాయి. చంద్రుగొండ నుండి గుర్రాయిగూడెం వెళ్లే రహదారి మధ్యలో రైల్వే బ్రిడ్జి ఉంది ఈ రైల్వే బ్రిడ్జి కింద వర్షం వస్తే వర్షపు నీరు నిల్వ ఉండి పాదచారులకు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అనునిత్యం గుర్రాయిగూడెం నుండి చంద్రుగొండకు గ్రామస్తులు రైతులు వస్తూ ఉంటారు. దీంతో రాత్రి సమయాలలో భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి నీటి నిల్వలు లేకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## జగదీశ్‌ను పరామర్శించిన ఎంఎల్‌ఏ



**ప్రజాపక్షం/ములకలపల్లి:** ములకలపల్లి మండల పరిధిలోని చాపరాపల్లి గ్రామంలో కాంగ్రెస్ నాయకులు నల్లమోతు జగదీశ్ అనారోగ్యంతో భాదపడుతూ హాస్పిటల్‌లో ట్రీట్మెంట్ పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న వారిని పరామర్శించి ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి గురించి ఎంఎల్‌ఏ జారె ఆది నారాయణ ఆరా తీశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మెడికల్ ఆఫీసర్ పోస్టుకు దరఖాస్తులు చేసుకోండి

**ప్రజాపక్షం/భద్రాచలం :** భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో ఏఆర్‌టి సెంటర్‌లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఒక మెడికల్ ఆఫీసర్ ఉద్యోగానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏహెచ్ సూపరింటెండెంట్ డా. ముదిగొండ రామకృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంబిబిఎస్ పూర్తి చేసిన వారు ఈ పోస్టుకు అర్హులని, ఆసక్తిగల అభ్యర్థులు సంబంధిత ధృవీకరణ పత్రాలతో జూన్ 29 నుండి జూలై 5 సాయంత్రం 4 గం. వరకు ఏఆర్‌టి సెంటర్, రూంనెం.38లో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. పూర్తి వివరాల కోసం 9963130775 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

## నేడు జాబ్ మేళా జూలై 1కి వాయిదా


**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** స్థానిక కొత్తగూడెం క్లబ్‌లో నేడు జరగాల్సిన జాబ్ మేళా అనివార్య కారణాల వల్ల జూలై 1వ తేదికి వాయిదా పడినట్లు జిల్లా యువజన క్రీడల అధికారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మెగా జాబ్ మేళాలో పాల్గొన దలచిన వారు ఆన్‌లైన్‌లో వెబ్‌సైట్ ద్వారా ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని, నేరుగా కూడా పాల్గొనవచ్చని తెలిపారు. ప్రతీ వ్యక్తి తప్పని సరిగా పది బయోడేటాలు తమ వెంట తీసుకుని రావాలని తెలియజేశారు.

## డ్రైనేజీ నిర్మాణానికి సహకరించండి



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** చంద్రుగొండ ప్రధాన సెంటర్ నుండి జూలూరుపాడు వెళ్లే రోడ్డుకు ఇరువైపులా నిర్మాణ పనులకు గ్రామస్తులు సహకరించాలని ఏఈ లకన్ నాయక్ అన్నారు. శుక్రవారం రహదారికి ఇరువైపులా డ్రైనేజీ నిర్మాణం కోసం మార్కింగ్ ఇచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైనేజీ నిర్మాణానికి రూ 3.20కోట్ల నిధులు మంజూరయ్యాయని, త్వరలోనే పనులు చేపడతామన్నారు. డ్రైనేజీ నిర్మాణం పూర్తి అయితే గ్రామంలో మురుగు నీరు బయటికి వెళ్తాయని ప్రజలకు ఇబ్బందులు తొలుగుతాయన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు భొజ్యా నాయక్, సదర్ క్లాస్ 1 కాంట్రాక్టర్ ఉప్పతల ఏడుకొండలు, సారేపల్లి శేఖర్, గాదశి శివప్రసాద్, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.5లక్షల చెక్కు అందజేత



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** విద్యుత్ షాక్‌తో చనిపోయిన రైతు కుటుంబానికి ఐదు లక్షల ఎక్స్‌గ్రేషియా అందజేయడం జరిగిందని విద్యుత్ శాఖ ఏడిఈ ఎండి యాసిన్ అన్నారు. శుక్రవారం స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో గత ఆరు నెలల క్రితం విద్యుత్ షాక్‌తో చనిపోయిన రాయికంపాడు గ్రామానికి చెందిన కుక్కల శ్రీనివాస్ కుటుంబానికి రూ 5లక్షల చెక్కును లక్ష్మి కి అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదవశాత్తు చనిపోయిన కుటుంబానికి విద్యుత్ శాఖ ఎక్స్‌గ్రేషియా చెల్లించడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో ఏఈ నరసింహారావు, సబ్ ఇంజనీర్ ప్రవీణ్, సిబ్బంది సతీష్, ఎండి బాబా తదితరులు పాల్గొన్నారు.

# పామాయిల్ కర్మాగారాన్ని సందర్శించిన మంత్రి తుమ్మల

**ప్రజాపక్షం/దమ్మపేటః** దమ్మపేట మండల పరిధిలోని అప్పారావుపేట పామాయిల్ కర్మాగారాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఉద్యానవన, సెరికల్చర్ డైరెక్టర్ ఐఏఎస్ అధికారి ఎస్.కే యాస్మీన్ భాషా శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పామాయిల్ కర్మాగారానికి వచ్చిన మంత్రి తుమ్మలకు ఉద్యానవన, సెరికల్చర్ డైరెక్టర్ ఎస్.కె యాస్మిన్ భాషకు పామాయిల్ కర్మాగారం అధికారులు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం అప్పారావుపేట ఆయిల్ కర్మాగారం ఫ్యాక్టరీ మొత్తం తుమ్మల నాగేశ్వరరావు, యాస్మిన్ భాష, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, ఆయిల్ ఫామ్ కర్మాగారం అధికారులతో పామాయిల్ కార్మాగారంలో గెలల దిగుమతి, నూనె తయారీ విధానాన్ని ప్రత్యక్షంగా తిలకించారు. ఈ సందర్భంగా తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉద్యానవన, సెరికల్చర్ డైరెక్టర్‌గా నూతనంగా ఐఏఎస్ అధికారిణీ ఎస్.కే యాస్మిన్ భాష నియామకం అవ్వడంతో ఆమెతో కలిసి పామాయిల్ ఫ్యాక్టరీ ను పరిశీలించేందుకు వచ్చామని, త్వరలో ఉన్నత అధికారులతో సమీక్ష సమావేశం



ఏర్పాటు చేసి పామాయిల్ ఫ్యాక్టరీను మరింత అభివృద్ధికి కృషి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పామాయిల్ ఫ్యాక్టరీ అధికారులు సుధాకర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, కళ్యాణ్, దమ్మపేట తహశీల్దార్ నరేష్, వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ అధికారులు, పామాయిల్ అడ్వైజరీ కమిటీ మెంబర్ ఆలపాటి రామచంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

# గ్రీన్ ఫీల్డ్ హైవే డిజైన్ మార్చండి



**-ధంసలాపురం వద్ద ఎంట్రీ, ఎగ్జిట్ అవకాశం కల్పించండి**
**-ఖమ్మం, పాలేరు, మధిర నియోజక వర్గ ప్రజల విజ్ఞప్తి**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మం, దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ హైవే డిజైన్ మార్చి బోనకల్ రోడ్డులోని ధంసలాపురం వద్ద (ఎన్‌హెచ్ 356 బిజి) ఎంట్రీ, ఎగ్జిట్ ఏర్పాటు చేస్తూ సర్వీస్ రోడ్లను ఏర్పాటు చేయాలని మధిర, పాలేరు, ఖమ్మం నియోజక వర్గాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఎంఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో నగర మేయర్ పునుకొల్లు నీరజ, కార్పొరేటర్లతో పాటు పలువురు సమావేశమయ్యారు. హైదరాబాద్ వైపు వెళ్లడానికి ఇటు మధిర, విజయవాడ వెళ్లేందుకు కూడా ఇక్కడ ఎంట్రీ, ఎగ్జిట్ అవసరమని సమావేశంలో పాల్గొన్న వక్తలు పేర్కొన్నారు. విలువైన భూములను గ్రీన్ ఫీల్డ్ హైవే కోసం ఇచ్చినప్పటికీ తమకు రోడ్డెక్కే అవకాశం కల్పించక పోవడం శోచనీయమన్నారు. ధంసలాపురం వద్ద ఎగ్జిట్, ఎంట్రీ అవకాశం కల్పిస్తే నాలుగు లక్షల జనాభా ఉన్న ఖమ్మం నగరంతో పాటు బోనకల్, చింతకాని మండలాలు, పాలేరు నియోజక వర్గ ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందని వారు తెలిపారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు మేడారపు వెంకటేశ్వర్లు, మందడపు లక్ష్మి మనోహర్, ఆళ్ల నిరీషా అంజిరెడ్డి, మదూరి ప్రసాద్, మందడపు మనోహర్‌రావు, మందడపు ప్రభాకర్‌రెడ్డి, బ్రహ్మరెడ్డి, దేవరపల్లి శ్రీనివాసరెడ్డి, అమరగాని వెంకన్న, బెల్లం మనోహర్ చౌదరి, సిపిఐ నాయకులు రమేష్, బిఆర్‌ఎస్ నాయకులు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు మల్లు భట్టివిక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుకు వినతి పత్రాలు అందజేయాలని నిర్ణయించారు.

# పేదల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి

**ప్రజాపక్షం/దమ్మపేటః** పేద ప్రజల సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర నాయకులు ముద్దా బిక్షం, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అమర్లపూడి రాము ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ దమ్మపేట మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రమైన దమ్మపేటలో భారీ ప్రదర్శన నిర్వహించి తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేసి సమస్యలతో కూడిన వినతి పత్రంతో పాటు వ్యక్తిగత దరఖాస్తులను తహశీల్దార్‌కు సమర్పించారు. అనంతరం జరిగిన సభలో వారు మాట్లాడుతూ ఇల్లు, ఇళ్ల స్థలాలు లేని వారందరికీ ప్రభుత్వం వెంటనే స్థలాల కేటాయించి, నిర్మాణానికి 10 లక్షల రూపాయలు ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో అనేక మంది నిరుపేదలు ఉండటానికి ఇల్లు లేక, ఇల్లు నిర్మించుకోవడానికి స్థలాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. వ్యవసాయ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం 12 వేల రూపాయల జీవన భృతి ఇవ్వాలని, ఈ సమస్యలను పరిష్కరించకుంటే రాష్ట్ర వ్యాప్తంగాఆందోళ



నలు చేపడతామని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తోడం దుర్గమ్మ, మండల కార్యదర్శి కురసం ముత్యాలరావు, బండి ఆదినారాయణ, కేసరి వెంకటేష్, తామా రాముడు, కుంజా కాంతారావు, కోంద్రు లక్ష్మి , పండూరి వీరబాబు, జంజునూరి ముక్తేశ్వరి, ఆర్. అనిల్, గంగాధర నాగమణి, నాగరాజు, సంధ్య, మడివి శ్రీను, పూజల సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

# వైరాలో ప్రారంభంకానున్న 100 పడకల వైద్యసేవలు

**ప్రజాపక్షం/వైరాః** వైరాలో జులై నెల నుండి 100 పడకల హాస్పిటల్ సేవలు అందుబాటులో ఉండనున్నాయి. వైద్య సేవలు అందించేందుకు జూన్21న వైరా వచ్చిన వైద్యాధికారులు 100 పడకల హాస్పిటల్ విధి నిర్వహణలో భాగంగా ప్రస్తుతం వైరాప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో ఏమి పరికరాలు ఉన్నాయి,




ఏమి వస్తువులు ఉన్నాయి,ఎన్ని మందులు ఉన్నాయి, ఎన్ని బెడ్లు, ఎన్ని పరికరాలు, ఏఏ ఫర్నీచర్ ఉంది అని ప్రతిఒక్కరి క్షుణ్ణంగా నమోదు చేసుకొని నివేదికను వైద్యశాఖ కమీషనర్‌కు పంపినట్లు సమాచారం. కల్లూరు, తిరుమలాయపాలెం, నేలకొండపల్లిలో ఏ విధంగా 100 పడకల వైద్యసేవలు ఏ విధంగా ప్రజలకు అందుబాటులో ఉంచుతున్నారో అదేవిధంగా ప్రస్తుతం వైరాలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నూతన 100 పడకల హాస్పిటల్ భవనం నిర్మాణం అయ్యేంత వరకు ఆరోగ్య కేంద్రంలో 100 పడకల సేవలను ఇక్కడ అందించనున్నారు. ప్రక్కనే ఉన్న ఆయుర్వేదం హాస్పిటల్ భవనాన్ని కూడా సేవలకు వినియోగించుకుంటున్నట్లు సమాచారం. జులై మొదటి వారంలో 100 పడకల హాస్పిటల్‌కు సేవలందించేందుకు గాను వైద్యులను,సిబ్బందిని కూడా వైరా ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపనున్నారు. దీనికి సంబంధిం సిబ్బంది నియామకాలుచేసి రాష్ట్ర వైద్యకమీషనర్ ఆదేశాలు మేరకు పంపనున్నారు. ప్రస్తుతం ఉన్న ప్రామిక ఆరోగ్య కేంద్రంలో ఇటు ప్రాథమిక పిహెచ్‌సి సేవలు, అటు వంద పడకల హాస్పిటల్ వైద్యసేవలు రెండూను విడివిడిగా ప్రజలకు అందించడం జరగనుంది. ఏదిఏమైనప్పటికి వైరాలోప్రజలకు మరింత మెరుగైన సేవలను అందించేందుకు ప్రభుత్వం 100 పడకల హాస్పిటల్ సేవలు ప్రారంభించనుండం అభినందనీయం. ఎన్నో సంవత్సరాల నుంచి 100 పడకల హాస్పిటల్ సేవలు కోసం ఎదురుచూస్తున్నారు. ప్రజల కల నెరవేరుతుంది.

# రైతుభరోసా అమలుపై సలహాల సమావేశాలు

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** రైతుభరోసా పథకం అమలుకై జిల్లాలోని అన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో ప్రత్యేక సభలు నిర్వహించి సూచనలు, సలహాలు తీసుకోనున్నట్లు జిల్లా సహకార అధికారి సయ్యద్ ఖుర్షీద్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పథకం అమల్లో తీసుకోవాల్సిన చర్యలపై నేటి నుండి జూలై 4వ తేది వరకు మహాజన సభలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సభలలో సహకార సంఘాల అధ్యక్షులు, పాలకవర్గ సభ్యులు, రైతులు, సంఘ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని తన విలువైన సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు.

# వాహనాల వేలం ద్వారా రూ.15 లక్షల ఆదాయం

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** వివిధ కేసుల్లో జిల్లా వ్యాప్తంగా సీజ్ చేసిన పలు వాహనాల వేలం ద్వారా రూ.15 లక్షల 4 వేలు సమకూరినట్లు ఎంటిఓ సుధాకర్ తెలిపారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలోని 306 వాహనాలతో పాటు 17కార్లు, ఆటోలు హెడ్‌క్వార్టర్‌లో వేలం వేసినట్లు చెప్పారు. సమకూరిన మొత్తాన్ని ప్రభుత్వఖాతాలో జమ చేసినట్లు తెలిపారు.

# వృద్ధురాలిని కాపాడిన బ్లూ కోల్ట్స్ పోలీసులు

**ప్రజాపక్షం/భద్రాచలం :** స్థానిక గోదావరి నదిలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వృద్ధురాలిని బ్లూ కోల్ట్స్ పోలీసులు శుక్రవారం కాపాడారు. వివరాల ప్రకారం, కొత్తగూడెం సమీపంలోని రామవరం కాలనీకి చెందిన భారతి అనే వృద్ధ మహిళ గత కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది.



క్రమంగా నొప్పిన వస్తుండటంతో తాళలేక, పిల్లలకు చెప్పి ఇబ్బంది పెట్టలేక ఆత్మహత్య చేసుకునేందుకు భద్రాచలంగోదావరి నదిలో దిగింది. ఆ వృద్ధురానికి కానిస్టేబుళ్లు నరేంద్ర, జంపయ్యలు కాపాడి చికిత్సల నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. సమయస్ఫూర్తి తో వృద్ధురాలిని కాపాడిన పోలీస్ సిబ్బందిని ఎస్‌పి రోహిత్ రాజ్ అభినందించారు.

# నాణ్యమైన నిత్యవసరాలు సరఫరా చేయాలి

**ప్రజాపక్షం/భద్రాచలం :** ఈ విద్యా సం.కు గానూ గిరిజన ఆశ్రమ పాఠశాలలు, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూళ్లకు నాణ్యతతో కూడిన వంట సరుకులు, పండ్లు సరఫరా చేయాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ సంబంధిత ఏజెన్సీల వారిని ఆదేశించారు. శుక్రవారం ఐటిడిఏ సమావేశ మందిరంలో నిర్వహించిన టెండర్ల తెరిచే ప్రక్రియలో పాల్గొన్నారు.



మొత్తం 114 మంది టెండర్ ప్రక్రియలో పాల్గొనగా తక్కువ కోట్ చేసిన టెండరు దారులకు వస్తువుల సరఫరా బాధ్యతను అప్పగించారు. వస్తువుల నాణ్యతలో ఎలాంటి లోపాలున్నా, విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభావం చూపినా ఏజెన్సీలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సరఫరా చేసే ప్రతీ రకాన్ని పరిశీలించాలని, ఎలాంటి లోపం కనిపించినా వెంటనే ఫిర్యాదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మందలపల్లిలో సుఖ వ్యాధులపై అవగాహన



**ప్రజాపక్షం/దమ్మపేటః** ఎయిడ్స్, క్షయ, సుఖ వ్యాధులపై మండల పరిధిలోని మందలపల్లి గ్రామ పంచాయితీ కార్యాలయంలో శుక్రవారం గ్రామప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా లింక్ వర్కర్ కవిత మాట్లాడుతూ హెచ్ఐవీ అనేది నాలుగు రకాలుగా సాగుతుందని, సురక్షితం కాని లైంగిక సంబంధాలు, రక్తమార్పిడి, కలుషిత సూది ఇంజక్షన్లు, హెచ్ఐవీ సోకిన తల్లి నుండి జన్మనిచ్చిన బిడ్డకు ఎయిడ్స్ సోకుతుందని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన వారు ప్రతి ఏటా ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా ఎయిడ్స్ పరీక్షలు చేయించుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ వెంకటేశ్వర్లు, ఏఎన్ఎం, ఆశావర్కర్, లింక్ వర్కర్ కవిత, ఎంపీటీసీతో పాటు పలువురు గ్రామస్తులు, యూత్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే చొరవతో బోరుకు మరమ్మతులు

**ప్రజాపక్షం/దమ్మపేటః** మండల పరిధిలోని అంకంపాలెం గ్రామంలో గల ఏకలవ్య స్కూల్‌ను ఇటీవల ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సందర్శించి విద్యార్థులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంచి నీటి బోరు కొన్ని రోజుల క్రితం పనిచేయడం లేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీంతో జారే వెంటనే స్థానిక ఎంపీడీవో కార్యాలయానికి ఫోన్ చేసి సమస్యను తెలపడంతో శుక్రవారం పంచాయితీ అధికారులు ఆ బోరుకు మరమ్మతులు నిర్వహించి మంచినీటి కొరతను విద్యార్థులకు తీర్చారు. మంచినీటి సమస్యను తెలిపిన వెంటనే పరిష్కరించిన ఎమ్మెల్యేకు ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు.



# గురుకుల పాఠశాలలో వసతుల కరువు..!




**-ఒకేచోట రెండు గురుకుల పాఠశాలలు**
**-770 మంది విద్యార్థినులకు 10 బాత్‌రూంలు**
**-ఇబ్బందులు పడుతున్న విద్యార్థినులు**
**-సరిపోని బెడ్స్**



**ప్రజాపక్షం/వైరా:** విద్యాబుద్ధులు నేర్చుకుందామని ఎన్నో ఆశలతో నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కాగానే గురుకుల పాఠశాలకు వచ్చిన విద్యార్థినిలకు సరైన వసతులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఖమ్మం జిల్లా వైరా మండలం రెబ్బవరం గ్రామంలో వైరా మండలానికి సంబంధించిన మహాత్మాజ్యోతిరావు పూలే బాలికల గురుకుల పాఠశాల ముసలిమడుగు గ్రామానికి మంజూరైంది. అక్కడ వసతులు లేక ఆ పాఠశాలను రెబ్బవరం గ్రామంలో నిర్వహిస్తున్నారు. ఇదే క్రమంలో 2024 విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో వైరా పట్టణానికి మంజూరైన మహాత్మాజ్యోతిరావుపూలే బాలికల గురుకుల పాఠశాలను భవన సదుపాయం లేక రెబ్బవరంలో ఉన్న జ్యోతిరావుపూట గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేశారు. ఈ రెండు పాఠశాలలో సుమారు 770 మంది విద్యార్థినిలు విద్యను అభ్యసించేందుకు పాఠశాల ప్రారంభం కాగానే వచ్చారు. కాని రెండు గురుకుల పాఠశాలల విద్యార్థులు కావడంతో వసతులు లేక విద్యార్థినిలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముసలిమడుగు గురుకుల పాఠశాలలో 440 మంది, వైరా మహాత్మా జ్యోతిరావుపూలే పాఠశాలలో 330 మంది విద్యార్థులు ఉన్నారు. రెండు పాఠశాలలో మొత్తం 770 మంది విద్యార్థినిలకు పది బాత్‌రూమ్‌లే ఉండడంతో తీవ్ర ఇబ్బందులు విద్యార్థినిలు ఎదుర్కొంటున్నారు. మరోపక్క బెడ్లు సక్రమంగా సమకూర్చకపోవడంతో ఒక్కొక్క బెడ్ మీద ఇద్దరు ముగ్గురు పడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. మరికొందరు నేలపైనే నిద్రిస్తున్నారు. రాత్రిపూట నిద్రపోతున్న విద్యార్థినిలు ఎప్పుడు ఏమి జరుగుతుందో అని ఆందోళన చెందుతున్నారు. విద్యార్థులు పడుకునేందుకు కూడా ఎక్కడ సరైన వసతులు లేవు. ముఖ్యంగా అడపిల్లలు చదువుకునే పాఠశాల కావడంతో వారి బాధను ఎవరికి చెప్పుకోలేని పరిస్థితి పాఠశాలకు విద్యార్థినిలను చూడటానికి వెళ్లి తల్లిదండ్రులు పిల్లల బాధలు విని తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఒక్కసారి జిల్లా అధికారులు మానవతా దృక్పధంతో ఆలోచించాలి. ఎందుకంటే 770 మంది విద్యార్థినిలకు పది బాత్‌రూమ్‌లు ఎలా సరిపోతాయి. బెడ్లు సమకూర్చకుండా విద్యార్థినిలు పట్ల నిర్లక్ష్యం ఎందుకు. ఇప్పటికైనా జిల్లా అధికారులు జోక్యం చేసుకొని మానవత్వంతో రెబ్బవరం గురుకుల పాఠశాలలో ఉన్న సమస్యలను పరిష్కరించి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని తల్లిదండ్రులు కోరుకుంటున్నారు.

# తరుణ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



**ప్రజాపక్షం/కల్లూరు:** తరుణ వ్యాధులు పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యులు నవ్య కాంత్ తబసుం లు అప్రమత్తంగా ఉండాలని ప్రజలను కోరుతున్నారు. వాతావరణంలో వచ్చిన మార్పులు ప్రతిరోజు వస్తున్న వర్షాల వల్ల నీరు కలుషితం పరిసరాల పరిశుభ్రత లేకపోవడం పారిశుధ్యం లేకపోవడం వలన చెత్తాచెదారం పేరుకుపోయి ఉండటం వలన దోమలు పెరగడం నీరు నిల్వ ఉండడం వల్ల వ్యాధులు ప్రబల అయ్యే అవకాశం ఉన్నట్లు దీని పట్ల ప్రజలు పలు జాగ్రత్తలు సలహాలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. రానున్న రోజుల్లో టైఫాయిడ్, మలేరియా, మెదడు వాపు, డెంగ్యూ, చికెన్ గున్యా లాంటి వ్యాధులు అయ్యే అవకాశం ఉందని తెలిపారు. కనుక వీటి పట్ల ప్రజలు జాగ్రత్తలు పాటించాలని వివరించారు. ప్రజలు అప్రమత్తతతో జాగ్రత్తలు పాటించినట్లయితే వాటి నుండి కాపాడుకోవచ్చని తెలిపారు. లక్షణాలు ఉన్నట్లయితే వెంటనే వైద్యులను సంప్రదించాలని వైద్యులు పేర్కొంటున్నారు. కల్లూరు మండల పరిధిలోని కల్లూరు, చెన్నూరు ,ప్రభుత్వ వైద్యశాలలో రోజువారీగా జ్వరం, తలనొప్పి, టైఫాయిడ్ , మలేరియా, దురదలు, దద్దుర్లు, రోగుల సంఖ్య రోజురోజుకు పెరుగుతుందని పేర్కొంటున్నారు .ప్రజలు రోగాల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించి తమ తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ప్రజలను కోరుతున్నారు. ఇప్పటికే కల్లూరులోని 70 నుంచి 150 మంది ఓ పి సంఖ్య పెరుగుతుందని వివరించారు. దీనికి నివారణ మార్గం పరిసరాల పరిశుభ్రత అవగాహన పెంచుకోవాలని సూచిస్తున్నారు. సమీపంలోని ఆరోగ్య ఉప కేంద్రాలు అందుబాటులో ఉన్నాయని ఆశ, ఆరోగ్య కార్యకర్తలు, పల్లె దవఖానవైద్యులు అందుబాటులో ఉన్నారని వెంటనే వారి సలహాలు సూచనలు తీసుకోవచ్చని తెలిపారు. వర్షాకాలం వ్యాధుల కాలం , దోమల కాలం, పాములు కాలం వాటికి అనుకూలంగా ఉండే కాలం కాబట్టి ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

# రసాభాసగా ఓపెన్ ఫోరం



**-సామాజిక తనిఖీలో వెలుగు చూసిన నిజాలు**
**-ఈజీఎస్ పనులను పరిశీలించిన అధికారులు**

**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** మండల కేంద్రంలో మండల పరిషత్ ఆవరణలో శుక్రవారం ఎన్ఆర్ఈజీఎస్ సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సామాజిక తనిఖీలో భాగంగా బృందం నిర్వహించిన తనిఖీలు పలు నిజాలు బయటపడ్డాయి. అన్ని పంచాయితీలలో కార్యదర్శులు రోజు వారి దివాస్ ప్రతి నెల చివరి వారంలో నిర్వహించాలి కానీ ఎవరు నిర్వహించడం లేదని కొందరు కార్యదర్శులకు దీనిపై అవగాహన లేదని ఒప్పుకున్నారు. పని జరిగే ప్రదేశంలో మూడు రకాల ఫోటోలు తీయాలని కానీ ఒక రకం ఫోటో మాత్రమే తీస్తున్నారు. రోలు కాల్ చేయడంల లేదు. చాలా రకాల పనులకు నేమ్ బోర్డులు లేవు. సంతకాలు లేకుండానే మస్టర్లు చేస్తున్నారు. పెద్ద వెంకటాపురం పంచాయితీలో చెరువు మట్టి పనిలో పని చేసిన దాని కంటే సుమారు లక్ష ఇరవై మూడు వేలు అదనంగా చెల్లించారని సామాజిక బృందం వారు తెలిపారు. అనంతరం అడిషనల్ డిఆర్‌డివో మాట్లాడుతూ ఈ మండలంలో పంచాయితీ కార్యదర్శి నుండి టీఏ, వీసీ, ఏపీవో, ఎంపిడివో అందరి అధికారులు నిర్లక్ష్యం ఉందని, దాని వల్లనే అనర్హులకు జాబ్ కార్డులు చాలా డబ్బులు దుర్వినియోగం అయ్యాయని వీటన్నింటిని రికవరీతో పాటు ప్రతి అధికారికి షోకాజ్ నోటీస్‌తో పాటు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈనిర్లక్ష్యాన్ని డిఆర్డీఏపిడి, జిలాల కలెక్టర్‌కు రిపోర్ట్ చేస్తానని అన్నారు. ఈకార్యక్రమంలో సామాజిక తనిఖీ అధికారి అనూష, విజిలెన్స్ వింగ్ అధికారి రమణ, జూనియన్ క్వాలిటీ అధికారి అనిల్, సోషల్ అడిట్ ఎస్‌టిఎం జ్ఞానేందర్, సోషల్ ఆడిట్ ఎస్ఆర్పి చెన్నకేశవుడు, సోషల్ ఆడిట్ డిఆర్‌పిలు, ఇన్‌చార్జ్ ఎంపిడివో శ్రీనివాసరావు, జెడ్‌పిటిసి హనుమంతరావు, ఎంపిపి మంజుభార్గవి, వైస్ ఎంపిపి రేసు ఎల్లయ్య, ఏపీవో రఘునాథ్, విసి అప్పారావు, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## తహసీల్దార్ కార్యాలయంలో చోరీ



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** బూర్గంపాడు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో చోరీ జరిగిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తహసీల్దార్ కార్యాలయంలో ఉన్న 8 ఇన్వర్టర్ బ్యాటరీలు, పలు పత్రాలను చోరీకి ప్రయత్నించడంగా గమనించిన స్థానికులు చూసి పట్టుకునే ప్రయత్నం చేయగా దొంగలించిన బ్యాటరీలు పత్రాలను వదిలేసి పారిపోయారని తెలిపారు. సంఘటనకు సంబంధించి తహసీల్దార్ ముజాహిద్ద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనపై బూర్గంపాడు ఎస్ఐ సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఘనంగా పివి నర్సింహారావు జయంతి



**ప్రజాపక్షం/ మధిర :** మాజీ ప్రధాని స్వర్గీయ పివి.నర్సింహారావు 103 జయంతి వేడుకలను స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పివి చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్ మాట్లాడుతూ ఆర్థిక సంస్కరణల జాతిపిత పివి.నర్సింహారావు అని అన్నారు. దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తొలి తెలుగు వ్యక్తి పివి అని, సంస్కరణలు తీసుకువచ్చి దేశాన్ని ఆర్థిక ఇబ్బందుల నుండి గట్టెక్కించిన గొప్ప నాయకుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మనుగోటి వెంకటేశ్వరరావు, షేక్.జహంగీర్, షేక్.జాకీర్‌హుస్సేన్, బాజీ, కర్నాటి రామారావు, నిడమనూరు వంశీకృష్ణ, పత్తేపురపు సంగయ్య, సంపసాల రామకృష్ణ, కోట నాగరాజు, మాగం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## సహకార సంఘం సేవలను సద్వినియోగం చేసుకోవాలి



**ప్రజాపక్షం/ మధిర :** సహకారం సంఘం ద్వారా రైతులకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కాకతీయ సహకార శిక్షణా కేంద్రం లెక్చరర్ పొనగంటి రాజయ్య అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని సిద్దినేనిగూడెం సొసైటీ పరిధిలోని సభ్యులకు సహకార విద్య నిర్వహణ కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సహకారం సంఘం, వారి బాధ్యతలు, సంఘం వ్యాపారం, సభ్యులకు సంఘంలో గల హక్కులు బాధ్యతలను వివరించారు. సహకార సంఘంలో సభ్యులుగా ఉన్న రైతులకు సబ్సిడీపై వ్యవసాయ ఎరువులు, పనిముట్లు అందచేయటం జరుగుతుందని, అలాగే ప్రమాదబీమా ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించటం జరుగుతుందని తెలిపారు. రైతులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు కటికల సీతారాంరెడ్డి, గ్రామ పెద్దలు సూరంశెట్టి నాగభూషణం, చల్లా లింగారెడ్డి, వేమిరెడ్డి రామిరెడ్డి, సొసైటీ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## రహదారుల మధ్యలో కల్వర్టులు నిర్మించాలి



**ప్రజాపక్షం/కారేపల్లి:** కారేపల్లి ప్రధాన రహదారిపై కాల్వలు శుభ్రం చేసి రెండు సంవత్సరాలు కావస్తున్నా ఈ కాల్వలకు అడ్డంగా ఉన్న రహదారుల మధ్యలో కల్వర్టులు నిర్మించకపోవడం వలన మురుగు నీరు కాల్వల్లో నిల్వ ఉండి దోమలతో వ్యాధులు వ్యాప్తి చెంది రోగాలు వస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. స్థానిక గ్రామపంచాయతీ కార్యదర్శి చెప్పినా కూడా స్పందించకపోవడం దారుణం. కావున కూడా జిల్లా అధికారులు స్పందించగలరు.

## అదృశ్యమైన బాలుడు అప్పగింత



**ప్రజాపక్షం/కల్లూరు:** ఖమ్మం రూరల్ పాండురంగపురం గ్రామానికి చెందిన బూరుగు అభిషేక్ గత రెండు రోజులు క్రితం కల్లూరు మండలం చెన్నూరు గ్రామం బాలుడు అమ్మమ్మ గారి ఇంటి వద్ద నుంచి తప్పిపోయాడు. ఖమ్మంలోని కొత్త బస్టాండ్ లో ఏకాంతముగా కూర్చున్న బాలుడిని కల్లూరు కు చెందిన ఇస్రేపల్లి సురేష్ కల్లూరు కి తీసుకొచ్చాడు. అతడిని కల్లూరు లోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొని వచ్చి వైద్యం చేయించగా అతనికి షుగర్ అధికంగా ఉండటంతో మందులు వైద్యులు నవ్య కాంత్ అందజేశారు. అనంతరం వైద్యులు స్థానిక సోషల్ మీడియాలో తెలుపగా చెన్నూరులోని వారి అమ్మమ్మ వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న మనవడిని పరామర్శించి కల్లూరు ఎస్ఐ షాకీర్ ఐసిడిఎస్ సిడిపిఓ మెహరున్నీసా బేగం, బాలల పరిరక్షణ విభాగం సోషల్ వర్కర్, హరిప్రసాదులు ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి వారు బంధువులకు అప్పగించారు. ఆ బాలుడికి తండ్రి లేకపోవడం వలన అమ్మమ్మ వద్దనే పెరుగుతున్నాడు. కల్లూరు ఎస్సై షాకీర్ వైద్యులు నవ్య కాంత్ సిడిపివో మెహరున్నీసాబేగం, బాలల పరిరక్షణ ఖమ్మం వారు అవగాహన కల్పించి బంధువులకు అప్పగించారు. వైద్యులు నవ్య కాంత్ ప్రత్యేక శ్రద్ధతో, అదృశ్యమైన బాలుడు దొరకడంతో బంధువులు కుటుంబీకులు సంతోషించారు. ప్రత్యేక శ్రద్ధ తీసుకున్న వైద్యులకు కుటుంబీకులు, బంధువులు నవ్యకాంత్ కు ధన్యవాదములు తెలిపారు.

# ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు..!

**-ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన కూలీలు**
**-పట్టించుకోని సంబంధిత అధికారులు**



**ప్రజాపక్షం/కారేపల్లి:** సింగరేణి మండల పరిధిలోని పోలంపల్లి గ్రామపంచాయతీలో కోటిలింగాల ఏరియా వ్యవసాయపు పనుల్లో చేనులో విద్యుత్ వైర్లు తక్కువ ఎత్తులో ఉండటంతో ప్రమాదపు గట్టిక సంభవించే అవకాశం ఉంది. వర్షాకాలం సీజన్ ప్రారంభం కావడంతో వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన రైతులు వ్యవసాయపు చేనులో పంటకు నిమగ్నమై ఉండగా విద్యుత్ వైర్లు ప్రమాదపు అంచున తక్కువ ఎత్తులో ఉండడం వలన ఏ సమయంలోనైనా భారీ ప్రమాదకటిక సంభవించే అవకాశం ఉంది. గత సంవత్సరం క్రితం నుంచి రైతులు మొరపెట్టుకున్న సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు వ్యవసాయం చేనులో తక్కువ ఎత్తులో వేలాడుతున్న విద్యుత్ వైర్లను ఎక్కువ ఎత్తులు సవరించాలని రైతులు విద్యుత్‌శాఖ అధికారులను వేడుకుంటునానరు.గతంలో మండల ఏకంద్రంలో విద్యుత్ వైర్లు తక్కువ ఎత్తులో ఉండడంతో మూగ జీవుల ప్రాణాలు పోగ, ఇదే స్థితి మరల పునరావృతం అయ్యే అవకాశం ఉండడంతో రైతులు ప్రాణాలు అరచేతులు పెట్టుకొని వ్యవసాయ పనులు చేయడం జరుగుతుందని ఆవేదన వ్యక్తపరిచారు. అధికారులు తక్షణమే చర్యలు చేపట్టి ప్రాణనష్టం నుంచి కాపాడాలని రైతులు కోరుతున్నారు.

# సికెల్ సెల్ ఎనీమియాపై అవగాహన కల్పించాలి

**ప్రత్యేకాధికారి, తహశీల్దార్ సూర్యనారాయణ**




**ప్రజాపక్షం/పినపాకః** సికెల్ సెల్ ఎనీమియా వ్యాధి పట్ల గ్రామాల్లో అవగాహన కల్పించడం ద్వారా వ్యాధిని అరికట్ట వచ్చని గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారి తహశీల్దార్ సూర్యనారాయణ తెలిపారు. జానంపేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సికెల్ సెల్ ఎనీమియా వ్యాధి అవగాహన కార్యక్రమానికి గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి (తహశీల్దార్) సూర్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 6 సంవత్సరాల వయస్సు నుండి 20 ఏళ్ల యుక్త వయస్సు కలిగిన వారిలో వచ్చే ఈ సికెల్ సెల్ ఎనీమియా వ్యాధి జన్యు పరమైన రక్త హీనత కారణంగా వస్తుందని అన్నారు. ఈ మేరకు గ్రామాల్లో అవగాహన కార్యక్రమం ద్వారా వ్యాధి నిర్మూలనకు అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి జి నాగిని, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# జీలుగు సాగు ఎంతో లాభదాయకం

**సందర్శించిన ఏఈఓ లక్ష్మణరావు**



**ప్రజాపక్షం/పినపాకః** పినపాక మండలం ఈ బయ్యారం పంచాయతీ పరిధిలో గల రైతులకు జీలుగు సాగు చేస్తున్న పంట పొలాలను శుక్రవారం వ్యవసాయ శాఖ విస్తరణాధికారి కొమరం లక్ష్మణ్ రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు తమ పరిధిలో గల వ్యవసాయ శాఖ అధికారులను కలిసి వారి సర్వే నెంబరుపై పంట నమోదు చేయించుకోవాలన్నారు. జీలుగు సాగుతో భూమిలో నత్రజని శాతం పెరిగి రైతులు పండించే పంట నాణ్యంగా పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ముక్కు బాల సుబ్బారెడ్డి, యాగంటి అంకిరెడ్డి, ముక్కు శివాజీ రెడ్డి, బట్ట వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# చేపలకు సంక్రమించే వ్యాధులపై శిక్షణ తరగతులు



**ప్రజాపక్షం/కూసుమంచి :** మత్స్య పరిశోధన స్థానం, పాలేరు, పి.వి నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయము హైదరాబాదు వారి ఆధ్వర్యంలో, భారతీయ వ్యవసాయ మరియు పరిశోధన మండలి షెడ్యూల్ కులాల ఉప ప్రణాళిక, వ్యవసాయ మరియు రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ భారత ప్రభుత్వము న్యూఢిల్లీ వారి ఆర్థిక సహకారంతో, తెలంగాణ మత్స్య కారులకు జరుగుతున్న రీ సర్క్యులేటరీ ఆక్వా కల్చర్ సిస్టమ్స్అధునాతన సాంకేతిక పరిజ్ఞానం అను అంశంపై 3 రోజుల నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమం 2వరోజు విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో ఖమ్మం మరియు సూర్యాపేట జిల్లాల నుంచి 25 మంది మత్స్య కారులు హాజరైనారు. డాక్టర్ ఎం.శ్యామ్ ప్రసాద్, సీనియర్ శాస్త్రవేత్త మరియు హెడ్ మాట్లాడుతూ రీసెర్క్యులేటరీ ఆక్వాకల్చర్ సిస్టమ్స్ లలో చేపలకు సంక్రమించే వివిధ రకాల వ్యాధుల గురించి మరియు వాటి యొక్క నివారణ చర్యల గురించి మత్స్య రైతులకు క్లుప్తంగా వివరించారు. జి. శ్రీనివాసరావు బ్లాక్ టెక్నాలజీ మేనేజర్, ఆత్మ, అశ్వరావుపేట డివిజన్, భద్రాద్రి కొత్తగూడెం డిస్ట్రిక్ట్ సీడ్ ప్యాకింగ్, మేత యాజమాన్యం మరియు చేప పిల్లల రవాణాలో తీసుకోవలసిన మెలకువలను గురించి మరియు రీసర్క్యులేటరీ ఆక్వా కల్చర్ సిస్టమ్స్ లలో చేప పిల్లలను స్టాకింగ్ చేసేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలను గురించి మాట్లాడుతూ తెలంగాణ షెడ్యూల్డ్ కులాల మత్స్య రైతులకు సంక్షిప్తంగా వివరించారు. రెండవ రోజైన శుక్రవారం జరిగిన కార్యక్రమంలో మత్స్యకారులు మత్స్య పరిశోధన స్థానం సీనియర్ సైంటిస్ట్ అండ్ హెడ్ అయినా డాక్టర్ ఎం. శ్యాంప్రసాద్ మరియు బి.రవీందర్, మత్స్య శాస్త్రవేత్త ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో రిషిక్ ఆక్వా ఫార్మ్స్ లో "రీ సర్క్యులేటరీ ఆక్వా కల్చర్ సిస్టమ్" (మంగళ గూడెం గ్రామం, ఖమ్మం రూరల్ మండలం, ఖమ్మం జిల్లా)ను సందర్శించి వారు ఆర్.ఏ.ఎస్ సాంకేతికతలో అవలంబిస్తున్న వివిధ రకాలైన నూతన యాజమాన్య పద్ధతుల గురించి అక్కడ చీఫ్ ఆపరేటర్ కం ఆఫీసర్ అయినటువంటి సుదర్శన్ కుమార్ ని అడిగి, క్షేత్రస్థాయిలో ప్రత్యక్షంగా చూసి తెలంగాణ మత్స్య రైతులు వారికి కలిగిన సందేహాలను నివృత్తి చేసుకోవడం జరిగినది. అదేవిధంగా మత్స్య పరిశోధన స్థానం పాలేరు, మత్స్య శాస్త్రవేత్త అయినటువంటి బి. రవీందర్ రీసర్క్యులేటరీ ఆక్వా కల్చర్ సిస్టమ్ లలో స్టాకింగ్ చేసే వివిధ రకాల చేపలను క్షేత్రస్థాయిలో చూపిస్తూ వాటి యొక్క ఐడెంటిఫికేషన్ క్యారెక్టర్ గురించి మత్స్య రైతులకు క్షుణ్ణంగా వివరించారు.


# చట్ట అవగాహనతో విద్యార్థులు బలోపేతం

**ప్రజాపక్షం/ ఖమ్మం లీగల్ :** బాలికలు బాల్య దశ నుంచే వారి రక్షణకు సంబంధించిన వివిధ చట్టాల గురించి అవగాహన పెంచుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ తరుపున సీనియర్ న్యాయవాది పొలిశెట్టి పద్మావతి తెలిపారు. శుక్రవారం వెలుగుమట్ల సమీపంలో గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడుతూ బాలికల అక్రమ రవాణా, సమాజంలో ఆడ పిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాలు, గుడుటచ్ బ్యాడ్ టచ్ గురించి తెలుసుకుని వాటి బారిన పడకుండా బాలికలు జాగ్రత్త పడాలని వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేకాధికారి జ్యోతి, ఏఐడి సంస్థ కో ఆర్డినేటర్స్ శ్రీనివాస్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు ప్రయోజనాల పరిరక్షణకే అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్‌లు

**ప్రజాపక్షం/ ఖమ్మం లీగల్ :** ఖమ్మంజిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్ లు రైతు ప్రయోజనాల పరిరక్షణకు పాటు పడాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. రాజగోపాల్ పిలుపునిచ్చారు. శుక్రవారం న్యాయమూర్తి లీగల్ ఎయిడ్ క్లినిక్ లలో సేవలందిస్తున్న పారా లీగల్ వాలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వారితో మాట్లాడుతూ కామేపల్లి మండలం ముచ్చర్ల, ఎర్రుపాలెం మండల మీనవోలు లలో తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు రైతులకు న్యాయ సలహాలు సూచనలు అందించే నిమిత్తం ఈ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కేంద్రాలలో సేవలందిస్తున్న పారా లీగల్ వాలంటీర్లు రైతు చట్టాలపై, వివిధ అంశాలపై అవగాహన కలిగి ఉండి రైతులకు సరైన సలహాలు, సూచనలు అందించాలన్నారు. ఈ లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రతి మంగళ, శుక్రవారాలు పని చేస్తాయని కనీసం ఒక వారం ఒక రైతు అయినా ఈ క్లినిక్ ల ద్వారా ప్రయోజనం పొందినట్లయితే ఈ కేంద్రాల ఏర్పాటుకు సార్థకత చేకూరుతుందన్నారు. పారా లీగల్ వాలంటీర్లు ఉత్తమ సేవలు అందించి న్యాయ సేవా సంస్థకు మంచి పేరు తీసుకు రావాలని న్యాయమూర్తి ఆకాంక్షించారు. ఇంకా సలహాలు, సూచనలు అవసరమైన రైతులను న్యాయ సేవా సంస్థకు తీసుకు రావాలన్నారు.

# ఇన్‌చార్జ్ డిఎల్పిఓగా చంద్రశేఖర్



**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరు రెవెన్యూ డివిజనల్ పంచాయతీ ఇన్చార్జి అధికారిగా కల్లూరు ఎంపీడీవో చంద్రశేఖర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ డివిజనల్ పంచాయతీ అధికారిగా బాధ్యతలు చేపట్టడం తో డివిజన్ పరిధిలోని ఏన్కూరు, తల్లాడ, కల్లూరు ,పెనుబల్లి, సత్తుపల్లి, వేంసూరు మండలాల పరిపాలన ఎంపీడీవోలు, ప్రత్యేక అధికారులు, కార్యదర్శులతో పరిపాలన సమన్వయంగా కొనసాగిస్తూ గ్రామాలలో ఎలాంటి సమస్యలు లేకుండా ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించేందుకు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. కల్లూరు లోని కార్యాలయ సిబ్బంది డివిజన్ పరిధిలోని. అధికారులు ఆయనకు పుష్పగుచ్చాలతో ఘన స్వాగతం పలికారు.

# భాగ్యనగర్ తండా బాగుపడేదెన్నడో..!?

**-సమస్యలను పట్టించుకోని పంచాయతీ కార్యదర్శి**




**ప్రజాపక్షం/కారేపల్లిః** కారేపల్లి మండలంలో పెద్ద గ్రామపంచాయతీ అయిన భాగ్యనగర్ తండాలో అన్ని వార్డులు సమస్యలతో సతమతమవుతున్నాయి. పంచాయతీలో గ్రామస్థులు ఒక సమస్య ఉందని గ్రామ కార్యదర్శికి చెబితే పట్టించుకోకుండా తను ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాడు. రోడ్డు మీద డ్రైనేజీ సమస్యల ఉందని గ్రామస్థులు పలుమార్లు మొరపెట్టుకున్న నాకు ఎలాంటి సంబంధం లేదు అంటూ చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నాడు. వర్షం పడితే రోడ్ల పైన బురద పేరుకుపోతున్న కనీసం ఆ రోడ్డు వైపుకి రాని పరిస్థితి. గ్రామపంచాయతీలో చెత్త ట్రాక్టర్ అది. ఊరు మొత్తం తిరగకుండా కార్యదర్శికి అనుకూలంగా ఉండే ప్రదేశాల్లో తిరుగుతున్నాయి. ఇదేమిటని ప్రశ్నిస్తుంటే నిర్లక్ష్యంగా సమాధానాలు ఇస్తున్నాడు. గ్రామంలో చాలా వీధి దీపాలు వెలగడం లేదు. కనీసం ఆ పని అయినా చేయండి అని కార్యదర్శి ద్గరికి వెళుతుంటే పట్టించుకోవడం లేదు. 8,9 వార్డుల్లో ప్రధాన రహదారిపై వర్షం పడితే అక్కడే రోడ్ల మీద మొత్తం బురద దాదాపుగా ఐదు రోజుల వరకు నిల్వ ఉంటుంది. రెండో సంవత్సరం నుంచి ఒక పైప్‌లైన్ ఏర్పాటు చేస్తే నిల్వ ఉన్న నీళ్ళు క్రిందకు వెళ్లిపోతాయి అని అక్కడి గ్రామస్థులు అనేకమార్లు చెప్పినా వాళ్ళ వంక చూడడం లేదు. గత రెండు సంవత్సరాల క్రింద పారిశుద్ధ్య పనుల్లో ముందడుగులో ఉన్న భాగ్యనగర్ తండా గ్రామాన్ని చిన్న భిన్నం చేసి అభివృద్ధిలో వెనుకంజలో ఉంచాడు. ఎన్నోసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా తన ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాడు. ఇకనైనా కార్యదర్శి తీరు మార్చుకొని గ్రామపంచాయతీని అభివృద్ధి పథంలో నడపాలని ప్రజలు కోరుకుంటున్నారు.